



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక :118 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి మంగళవారం 12 మే 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :118 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI TUE 12 MAY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు
## అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

- 1998 పోక్రాన్ అణు పరీక్షలను గుర్తుచేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు
- సోమనాథ్ ఆలయ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని
- బుజ్జగింపు రాజకీయాలపై ప్రతిపక్షాలను విమర్శించిన మోదీ
- సోమనాథ్ పునరుద్ధరణ భారత సాంస్కృతిక స్వేచ్ఛకు ప్రతీక అని వెల్లడి

మిగతా 2లో

## ఈసారి యుద్ధం మాములుగా ఉండదు
## భారత్‌కు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ బెదిరింపులు



పెన్ పవర్ డెస్క్:పాకిస్తాన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ మరోసారి భారత్‌పై ఆక్రోశం వెళ్లగక్కారు. భవిష్యత్‌లో పాకిస్తాన్‌పై ఇండియా ఎలాంటి దాడులకు పాల్పడిన ప్రతిదాడి మూములుగా ఉండదని ప్రగల్భాలు పలికారు. ఇండియా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రావల్పిండిలోని జనరల్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మునీర్ మాట్లాడుతూ.. "భవిష్యత్తులో ఇండియా పాకిస్థాన్‌పై ఏదైనా దుశ్చర్యకు

మిగతా 2లో

# ఇది జాతీయ టాస్క్...
# ప్రతి ఒక్కరూ స్వీకరించాలి

## సీఐఐ సదస్సులో చంద్రబాబు







- ప్రధాని మోదీ ఇచ్చిన 8 సూత్రాల జాతీయ మిషన్‌ను వివరించిన చంద్రబాబు
- మోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ధీమా
- ప్రకృతి సేద్యం ద్వారా ఎరువుల దిగుమతి తగ్గించవచ్చని సూచన
- ఏపీలో 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నామని వెల్లడి
- దేశం, రాష్ట్ర ప్రయోజనాలే తన అజెండా అని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:దేశ స్వయం సమృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచిన 8 అంశాల జాతీయ మిషన్‌ను ప్రతిఒక్కరూ స్వీకరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగిన సీఐఐ బిజినెస్ సమ్మిట్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని ప్రతిపాదించిన 8 సూత్రాలను కూలంకషంగా వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేయాలని ప్రధాని పిలుపునిచ్చినట్లు చంద్రబాబు గుర్తుచేశారు. ఇంధనాన్ని పొదుపుగా వాడాలని, అదే సమయంలో ప్రతి ఇల్లు, పరిశ్రమ, పొలం ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలని సూచించారు. యుద్ధానంతర పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో తలెత్తిన ఇబ్బందులను అధిగమించేందుకు ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడం కీలకమన్నారు. దేశంలో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నందున, 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని ప్రోత్సహించాలని ప్రధాని సూచించినట్లు తెలిపారు. వీటన్నింటి ద్వారా 'గ్రేటర్ సెల్ఫ్ రిలయన్స్' (సంపూర్ణ స్వావలంబన) సాధించడం సాధ్యమవుతుందని, ఇందులో భాగంగా ప్రకృతి సేద్యం కీలక పాత్ర పోషిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రకృతి సేద్యం వల్ల ఎరువుల దిగుమతి తగ్గి దేశం స్వయం సమృద్ధి సాధిస్తుందని అన్నారు. మొత్తమ్మీద ఇది ఒక జాతీయ టాస్క్ అని, దీన్ని అందరూ కలిసికట్టుగా సాధించాలని ఆయన కోరారు.

### మోదీ నాయకత్వంలో భారత్ అగ్రగామి

దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ లభించారని చంద్రబాబు ప్రశంసించారు. సంస్కరణల వాది అయిన మోదీ నేతృత్వంలో భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో సుస్థిరమైన ప్రభుత్వాలు

మిగతా 2లో



## 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం
### నిమ్మల రామానాయుడు

- ఏపీని కరవు రహితంగా మార్చడంలో పోలవరం కీలకమన్న నిమ్మల
- గోదావరి, కావేరి అనుసంధానంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వెల్లడి
- గోదావరి నుంచి ప్రతి ఏటా 3 వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందన్న మంత్రి

మిగతా 2లో

## నేడు అనంతపురం జిల్లాకు వెళ్లనున్న జగన్



- పామిడిలో ఒక వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరుకానున్న జగన్
- అనంతరం తాడేపల్లికి బయల్దేరనున్న వైసీపీ అధినేత
- జగన్ రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు చేస్తున్న వైసీపీ శ్రేణులు

మిగతా 2లో



## మూడో ప్రత్యామ్నాయం... ఏపీకి విశ్వసనీయ పార్టీ కావాల్సిందే

- ఏపీకి మూడో ప్రత్యామ్నాయం అవసరమన్న విజయసాయి రెడ్డి
- రాష్ట్ర రాజకీయాలు రెండు తీవ్ర ధోరణుల మధ్య చిక్కుకున్నాయని వ్యాఖ్య
- టీడీపీది పట్టణ పక్షపాతమని, వైసీపీది కేవలం సంక్షేమమని విమర్శ
- అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేసే నాయకత్వం రావాలని ఆకాంక్ష

పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజకీయాలపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి ఇప్పుడు ఒక బలమైన మూడో ప్రత్యామ్నాయం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

మిగతా 2లో

## తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియామకం

- ఆరుగురు సభ్యులను కూడా నియమించిన ప్రభుత్వం
- సభ్యుల్లో కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత తదితరులు
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

మిగతా 2లో



## మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

- నెల రోజుల పాటు వాడవాడలా టీఆర్ఎస్ జెండా పండుగలు
- రాజధాని నుంచి గ్రామస్థాయి వరకు జెండా పండుగ
- పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జెండా పండుగ

మిగతా 2లో




## చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్



- తమిళనాడు సీఎం విజయ్, మాజీ సీఎం స్టాలిన్‌తో భేటీ
- ఎమ్మెల్యేగా ప్రమాణం చేశాక స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం
- విజయ్‌ను ఆలింగనం చేసుకుని శాలువాతో సత్కరించిన స్టాలిన్
- ఈ సమావేశంలో ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్న వైనం

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్.. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ఆయన నేరుగా చెన్నైలోని స్టాలిన్ నివాసానికి వెళ్లారు.తన నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి విజయ్‌ను స్టాలిన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుని, శాలువాతో సత్కరించారు. ఈ భేటీలో స్టాలిన్ కుమారుడు,

మిగతా 2లో

## చంద్రబాబు ఇంటి పక్కన ఎవరూ నివసించకూడదని ఇలా చేస్తున్నారా?

- చంద్రబాబు ఇంటి సమీపంలోని స్థలాన్ని గ్రీన్ బెల్ట్ గా ప్రకటించారన్న పేర్ని నాని
- రెసిడెన్షియల్ ఏరియాగా ఉన్న ఆ ప్రాంతం అకస్మాత్తుగా గ్రీన్ బెల్ట్‌గా ఎలా మారుతుందని ప్రశ్న
- అమరావతిని అవినీతికి కేంద్రంగా మార్చేశారని విమర్శ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన విమర్శలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ముఖ్యంగా అమరావతి రాజధాని ప్రాంతంలో చంద్రబాబు నిర్మించుకుంటున్న నివాసం మరియు అక్కడ జరుగుతున్న ప్లాట్ల కేటాయింపులపై

మిగతా 2లో



## ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్నారు.. తెలంగాణకు ఏం ఇచ్చారు?

- జనగణన ఫారమ్‌లలో లోపాలు ఉన్నాయన్న పొన్నం
- బీసీలను విస్మరించారని విమర్శ
- గత 12 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమని సవాల్

మిగతా 2లో

## జులై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' చట్టం



- గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ
- కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు అంతరాయం కలగకుండా చర్యలు
- కొత్త కార్డులు జారీ అయ్యే వరకు ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటు

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# మోడీ చెప్పినట్లే లైఫ్ స్టైల్ మార్చేయటం ఈజీనా?

దేశ ప్రజలకు ఎంతో ఇష్టమైన పనిని చేయొద్దని దేశ ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. కాసిన్ని డబ్బులు చేతిలో ఉంటే.. మొదటి ఆలోచన బంగారం కొనటంపైనే ప్రతి ఒక్కరు ఆలోచిస్తారు. పెళ్లిళ్లు మొదలు కొని ప్రత్యేకంగా జరుపుకునే ఫ్యామిలీ ఫంక్షన్ల వరకు అన్నింటిలోనూ బంగారం కొనుగోలు చేయటం కనిపిస్తూ ఉంటుంది. బంగారానికి.. భారతీయులకు ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలాంటి బంగారం కొనుగోలు మీద ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఏడాది పాటు బంగారం కొనుగోలు చేయకపోవటం మంచిదన్న ఆయన.. అందుకు కారణాన్ని చెప్పుకొచ్చారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా బంగారం అత్యంత ఖరీదైందిగా మారిందన్న ప్రధాని మోడీ.. విలువైన విదేశీ మారకద్రవ్యం పోతుందన్నారు. అక్కడితో ఆగని ఆయన పెట్రోల్.. డీజిల్ తో పాటు.. విదేశీ ప్రయాణాలు.. దుబారా ఖర్చుల్నిపూర్తిగా తగ్గించుకోవాలన్నారు. పెట్రోల్.. డీజిల్ ను పరిమితంగా వినియోగించాలన్న ఆయన.. అందులో భాగంగా ప్రజలు ప్రజా రవాణాను అధికంగా వాడాలని పిలుపునిచ్చారు. ఈ మాటలన్ని కూడా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో బీజేపీ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో చెప్పారు. పెట్రోలో.. డీజిల్.. గ్యాస్.. యూరియా ధరలు అమాంతంగా పెరిగినప్పటికి ప్రజలపై భారం పడకూడదన్న ఉద్దేశంతో ధరలు పెంచలేదన్న మోడీ.. ప్రస్తుతం ప్రపంచం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని చెబుతూ తాజాగా జరుగుతున్న యుద్ధాలను గురించి చెప్పుకొచ్చారు. ఈ యుద్ధాలతో సరఫరా చైన్ దెబ్బతిందని.. సదరు నష్టాల్ని కేంద్రమే భరిస్తోందన్న ఆయన.. వంటనూనెలు.. ఎరువుల మందుల వినియోగాన్ని తగ్గించాలని ప్రజల్ని కోరారు. మోడీ కోరినట్లుగా బంగారాన్ని ఏడాది పాటు కొనుగోలు చేయకుండా ఉండటం సాధ్యమేనా? అంటే అంత తేలికైన పని కాదని చెప్పాలి. ఎందుకంటే.. భారతీయుల్లో అత్యధికులు బంగారాన్ని కొనుగోలు చేయటానికి చాలా ముందు నుంచే ప్లానింగ్ చేస్తుంటారు. ముఖ్యంగా ఫంక్షన్ల సమయంలో కొనుగోలు చేయాలని భావించే బంగారాన్ని వాయిదా వేయటం అంత తేలికైన విషయం కాదు. బంగరాన్ని భవిష్యత్ పెట్టుబడిగా.. పొదుపుగా.. ఫ్యూచర్ అవసరాలకు సాయం చేసేదిగా భావిస్తారు. అలాంటప్పుడు బంగారాన్ని కొనటం తగ్గించమన్న ప్రధాని మోడీ మాటలకు ప్రభావం అంతగా ఉండకపోవచ్చునే చెప్పాలి. ఒకవేళ.. ఆయన మాటల్ని ప్రజలు సీరియస్ గా తీసుకోవాలంటే అందుకు బదులుగా ఏదైనా తాయిలాన్ని ప్రకటిస్తే మంచిది. అదెలా అంటే.. ఉదాహరణకు బంగారం మీద ఇప్పుడున్న పన్నులను ఏడాది తర్వాత తగ్గించే విషయంతో పాటు.. బంగారం కొనుగోలుతో వచ్చే ధీమాకు సరిపడా కేంద్ర సర్కారు ప్రజలకు ఇవ్వగలిగితే.. ఆయన మాటల్ని పెద్ద ఎత్తున వినే వీలుంది. అదేం లేకుండా.. బంగారాన్ని కొనొద్దంటే.. కొనకుండా ఉండటం అంత తేలికైన విషయం కాదన్నది మర్చిపోకూడదు.

## మూడో ప్రత్యామ్నాయం... ఏపీకి విశ్వసనీయ పార్టీ కావాల్సిందే

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు ఆయన చేసిన తాజా ట్వీట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర రాజకీయాలు రెండు విచిత్ర ధోరణుల మధ్య చిక్కుకుపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి టీడీపీ, వైసీపీల విధానాలను విమర్శించారు. "ఒకవైపు గ్రామీణ ప్రాంతాలను విస్మరించే టీడీపీ పట్టణ కేంద్రీకృత దృక్పథం, మరోవైపు అభివృద్ధిపై దార్శనికత లేని వైసీపీ కేవలం సంక్షేమ విధానం.. ఈ రెండు తీవ్ర ధోరణుల మధ్య ఏపీ రాజకీయాలు నలిగిపోతున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రానికి ఎలాంటి నాయకత్వం అవసరమో కూడా ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమాలను సమన్వయం చేసే విశ్వసనీయమైన మూడో ప్రత్యామ్నాయం ఏపీకి కావాలని ఆయన ఆకాంక్షించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షిస్తూనే, వాటి ఫలాలను రాష్ట్రంలోని ప్రతీ ప్రాంతానికి చేరేలా చూసే నాయకత్వం రావాలని విజయసాయి రెడ్డి తన ట్వీట్‌లో వివరించారు. ఇటీవలే విజయసాయిరెడ్డి తాను కొత్త పార్టీ పెడతానని సూచనప్రాయంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తాజా ట్వీట్ ప్రాధాన్యత సంతరించుకుంది.

## చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్

- మొదటి పేజి తరువాయి

మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు.

డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎంల మద్దతుతోనే విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చే విషయంలో తమ మిత్రపక్షాలకు స్టాలిన్ పూర్తి స్వేచ్ఛ కల్పించారు. ఈ నేపథ్యంలోనే, ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు పరోక్షంగా సహకరించిన స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకే విజయ్ ఆయనను కలిసినట్లు తెలుస్తోంది. సీఎం బాధ్యతలు చేపట్టాక విజయ్, స్టాలిన్‌ను కలవడం ఇదే తొలిసారి. ఈ భేటీ తమిళ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించింది.

# నేడు అనంతపురం జిల్లాకు వెళ్లనున్న జగన్

వైసీపీ అధినేత జగన్ నేడు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. యూరప్ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన తర్వాత ఆయన చేపడుతున్న మొదటి జిల్లా పర్యటన ఇదే కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.రేపు మధ్యాహ్నం ఆయన అనంతపురం జిల్లాలోని పామిడికి చేరుకుంటారు. ఎమ్మెల్సీ మధుసూదన్ కుమారుడు చైతన్య మిత్ర, వైసీపీ నేత పామిడి వీరా కుమార్తె, ఏడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్‌పర్సన్ లిఖితల వివాహ రిసెప్షన్ వేడుకకు ఆయన హాజరుకానున్నారు. గుంతకల్లు నియోజకవర్గం పరిధిలోని పామిడిలో నిర్వహించనున్న ఈ వేడుకలో పాల్గొని, నూతన వధూవరులను జగన్ ఆశీర్వదించనున్నారు.జగన్ రాకను పురస్కరించుకుని పామిడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పార్టీ

కీలక నేతలందరూ ఈ వేడుకకు తరలివచ్చే అవకాశం ఉంది. భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన తాడేపల్లికి బయల్దేరుతారు.

## చంద్రబాబు ఇంటి పక్కన ఎవరూ నివసించకూడదని ఇలా చేస్తున్నారా?

- మొదటి పేజి తరువాయి

ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటిని నిర్మించుకుంటున్న సంగతి తెలిసిందే. ఇంటి నిర్మాణం దాదాపుగా పూర్తి అవుతోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబుపై వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని విమర్శలు గుప్పించారు. చంద్రబాబు కడుతున్న ఇంటి సమీపంలో సుమారు 3800 గజాల భూమిని 'గ్రీన్ బెల్ట్'గా ప్రకటించడంపై పేర్ని నాని అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో రెసిడెన్షియల్ ఏరియాగా ఉన్న ఆ ప్రాంతం అకస్మాత్తుగా గ్రీన్ బెల్ట్‌గా ఎలా మారుతుందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు ఇంటి పక్కన ఇతరులెవరూ నివసించకూడదనే ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారా అని నిలదీశారు. సాధారణ రైతులకు ఇవ్వని ప్రాధాన్యత చంద్రబాబు బినామీలకు మాత్రం అమరావతిలో దక్కుతోందని ఆరోపించారు.

సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు వంటి కీలక భవనాల మధ్యలోనే చంద్రబాబుకు ప్లాటు ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ నివాసాన్ని ఏ రకమైన 'ప్యాలెస్' అని పిలవాలని ఎద్దేవా చేశారు. రాజధానిని అవినీతికి కేంద్రంగా మార్చేశారని విమర్శిస్తూ, రైతులకు చెందాల్సిన న్యాయం కేవలం కొందరికే పరిమితం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణంలో పారదర్శకత లేదని, కేవలం సొంత ప్రయోజనాల కోసమే నిర్ణయాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు.

## మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

తమ పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు నెల రోజుల పాటు వాడవాడలా జెండా పండుగలు నిర్వహించనున్నట్లు కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ప్రకటించింది. ఈ మేరకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మే 20 నుండి జూన్ 20 వరకు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి వరకు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహిస్తామని తెలిపింది. పార్టీ ఆవిర్భావ సభలో తెలిపిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వివరిస్తారని వెల్లడించింది. నేడు తెలంగాణ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎక్కడికక్కడ గళమెత్తవలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు ఇప్పటికే సూచించినట్లు తెలిపింది. అందులో భాగంగా రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానిక సమస్యల పట్ల కూడా అక్కడి శ్రేణులు స్పందించడం, అవసరమైనచోట పోరాటానికి సిద్ధంగా ఉంటారని తెలిపింది.టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా కార్యకర్తలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావాలని పిలుపునిచ్చింది. కలిసి వచ్చే వారిలో సమాజం పట్ల బాధ్యత, అంకితభావం కలిగిన చురుకైన కార్యకర్తలతో సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాజకీయ చైతన్యం నిండిన ఒక బలమైన జన సమూహాన్ని ప్రజా ఉద్యమాల కోసం నిర్మిద్దామని పిలుపునిచ్చింది.

# భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోఖ్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో జరిగిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోఖ్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన వాళ్ళం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు.సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు. ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు.పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.

## ఈసారి యుద్ధం మాములుగా ఉండదు భారత్‌కు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ బెదిరింపులు

- మొదటి పేజి తరువాయి

పాల్పడితే ప్రతిదాడి ప్రభావం పరిమితంగా ఉండదు. అత్యంత విస్తృతంగా, ప్రమాదకరంగా, సుదూరంగా, బాధాకరంగా ఉంటుందని మన శత్రువులు తెలుసుకోవాలి" అని అన్నారు.

2025 మేలో ఇండియా, పాక్ మధ్య జరిగిన సంఘర్షణలో భారత్ కంటే పాకిస్తాన్ అవలభించిన వ్యూహాలే మెరుగైనవని బీరాలు పలికారు. గత సంవత్సరం జరిగిన సైనిక ఘర్షణ సమయంలో పాకిస్థాన్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడానికి భారత్ విఫలయత్నం చేసిందని.. భారత్ చర్యలను పాకిస్తాన్ పూర్తి జాతీయ ఐక్యత, సైనిక బలంతో తిప్పికొట్టిందని పేర్కొన్నారు. రెండు అణుశక్తి దేశాల మధ్య సంఘర్షణ కేవలం రెండు దేశాలు, సైన్యాల మధ్య జరిగే సాంప్రదాయ యుద్ధం మాత్రమే కాదని, వాస్తవానికి అది రెండు సిద్ధాంతాల మధ్య జరిగిన యుద్ధమని.. ఈ యుద్ధంలో అల్లా దయవల్ల సత్యం గెలిచి. అసత్యం ఓటమి ఓటమి పాలైందని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 2025, మేలో ఇండియా, పాక్ మధ్య తలెత్తిన సైనిక ఘర్షణ ఆకస్మికంగా జరిగింది కాదని.. అది ఇండియా ఎత్తుగడలో భాగమని ఆరోపించారు. కాగా, పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 2025 మే నెలలో ఇండియా చేపట్టిన ఆపరేషన్ సిందూర్?కు ఏడాది పూర్తి అయిన సందర్భంగా అసిమ్ మునీర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ గడువుపై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. పీపీఏ, సీడబ్ల్యూసీ నిర్దేశించిన గడువు ప్రకారం 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కలిసి ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారని తెలిపారు.

గత ఏప్రిల్ నాటికే కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తవ్వడం ప్రాజెక్టు నిర్మాణం వేగానికి సంకేతమని పేర్కొన్నారు. తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసేలా నిర్మాణ పనులకు పూర్తి సహకారం అందించాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరినట్టు నిమ్మల తెలిపారు.

ఏపీని కరవు రహిత రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమని మంత్రి చెప్పారు. గోదావరి-కావేరి అనుసంధానంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వెల్లడించారు. ప్రతి ఏటా గోదావరి నుంచి సుమారు 3000 టీఎంసీల వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని,

ఈ నీటిని మళ్లించడం ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు భారీ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. దీనికి సంబంధించి ఒక పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భూగర్భ జలాల పెంపు కోసం విజయనగరంలో ప్రయోగాత్మకంగా ఎంసీఏడీ మోడల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

## ఇది జాతీయ టాస్క్... ప్రతి ఒక్కరూ స్వీకరించాలి

- మొదటి పేజి తరువాయి

ఉన్నాయని, ఇది అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఒకప్పుడు దేశానికే ఆదర్శంగా నిలిచిన పశ్చిమ బెంగాల్, గత కొంతకాలంగా అభివృద్ధి ఆలోచనలే లేకుండా వెనుకబడిపోయిందని ఆయన అభిప్రాయపడ్డారు.

1990లలో పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశానికి ఎన్నో అవకాశాలు కల్పించాయని, టెలికాం, విద్యుత్, రహదారుల రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. ఆ సంస్కరణల్లో తాను కూడా భాగస్వామిని కావడం సంతోషంగా ఉందన్నారు.

**ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్**

ప్రధాని ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పలు చర్యలు చేపడుతోందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో 'ప్రోజ్యూమర్' (ఉత్పత్తిదారు-వినియోగదారు) విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. మైక్రో గ్రిడ్ వ్యవస్థ ద్వారా విద్యుత్ సరఫరా నష్టాలను తగ్గిస్తున్నామన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారని, దీని ద్వారా భూసారాన్ని పెంచుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నామని వివరించారు. ప్రతీ సవాలు ఒక అవకాశాన్ని సృష్టిస్తుందని, భారత్ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని (అన్‌స్టాపబుల్), త్వరలోనే దేశం ఒక గ్లోబల్ జెయింట్‌గా మారుతుందని చంద్రబాబు అన్నారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాలే తన అజెండా అని ఆయన స్పష్టం చేశారు.

# తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియామకం

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమితులయ్యారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, ఆరుగులు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవ రెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా షకీరాలను నియమించారు. వీరి పదవీకాలం ఐదేళ్ల పాటు ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్రంలోని మహిళల హక్కులను పరిరక్షించడానికి, వారిపై జరుగుతున్న అన్యాయాలు, వేధింపులను అరికట్టడానికి ఏర్పాటు చేయబడిన చట్టబద్ధమైన సంస్థ. ఇది మహిళలకు న్యాయం చేకూర్చడం, సంక్షేమం మరియు సాధికారత కోసం పనిచేస్తుంది.

# ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్నారు.. తెలంగాణకు ఏం ఇచ్చారు?

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన, హౌస్ హోల్డ్ సర్వే ఫారమ్‌లలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్వే ఫారమ్‌లో కేవలం ఎస్సీ, ఎస్టీ అనే ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని, మెజారిటీ జనాభా కలిగిన బీసీల ప్రస్తావనే లేకపోవడం వారిని విస్మరించడమేనని మండిపడ్డారు. బీసీల అభివృద్ధికి కులగణన అత్యవసరమని, కేంద్రం ఈ విషయంలో వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు.తెలంగాణపై కేంద్రం చూపుతున్న వివక్షపై స్పందించాలని రాష్ట్ర బీజేపీ నేతలకు మంత్రి సవాల్ విసిరారు. గత 12 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన నిధులపై సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద లేదా మరెక్కడైనా సరే బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్న కేంద్రం, తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ, "రాష్ట్రానికి ఏం ప్రాజెక్టులు ఇస్తారో చెప్పకుండా, బంగారం కొనొద్దు అని సలహాలు ఇవ్వడానికే మోదీ వచ్చారా?" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అనేకసార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా నిధుల విడుదలపై స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాముడిని తాము కూడా పూజిస్తామని, అయితే బీజేపీలాగా ఓట్ల కోసం దేవుడిని వాడుకోమని స్పష్టం చేశారు.

## జులై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' చట్టం

జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజల ఆదాయ కల్పన కోసం 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని జులై 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ (వీబీ-జీ-రామ్-జీ)ను తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టాన్ని జులై నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించింది.దీని ద్వారా గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ లభిస్తుందని తెలిపింది. జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజలకు ఆదాయ కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల్లో పరివర్తనను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యమని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారెంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఈ-కేవైసీ ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీలో నమోదు చేసుకోవాలని సూచించింది. వేతన చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం, పని కేటాయింపు నిబంధనలు, పరిపాలనా వ్యయం వంటి ఇతర అంశాల గురించి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# పదవ తరగతి టాపర్లకు జ్ఞాపికలు, నగదు బహుమతుల ప్రదానం చేసిన ఎమ్మెల్యే కాకర్ల..!

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన 63 మంది మెరిట్ విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకం..!
## విద్యార్థుల విజయాల్లో ఉపాధ్యాయుల కృషి అమోఘం : కాకర్ల సురేష్..!
## నారా లోకేష్ విద్యా సంస్కరణల ఫలితమే ఉత్తమ ఫలితాలు : ఎమ్మెల్యే కాకర్ల..!
## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభపై ఎమ్మెల్యే ప్రశంసలు..!






(పెన్ పవర్ ప్రతినిధి వింజమూరు మే 11:) వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయములో నిర్వహించిన "పదవ తరగతి ఉత్తమ ప్రతిభావంతుల అభినందన మరియు ప్రతిభ ప్రోత్సాహక కార్యక్రమం" ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ గారు హాజరై, పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించి, ప్రభుత్వ పాఠశాలలలో ప్రధమ స్థానాలు సాధించిన ప్రతిభావంతులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి గౌరవ విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ బాబు గారు తీసుకొచ్చిన సంస్కరణలు, ఆధునిక విద్య విధానాలు మరియు విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహక కార్యక్రమాల ఫలితంగానే ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం పట్టుదల, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో ఉన్నత ఫలితాలను సాధించడం గర్వకారణమని అన్నారు. అదేవిధంగా ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నాయకుల సహకారంతో ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో విశేష ప్రతిభ కనబరిచిన నియోజకవర్గంలోని 63 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేయడం జరిగింది. విద్యార్థుల కృషిని గుర్తించి వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే గారు తెలిపారు. అలాగే ఉత్తమ ఫలితాల సాధనలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రుల త్యాగం, ఉపాధ్యాయుల అంకితభావం, సమాజ సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన ఎమ్మెల్యే గారు, వారు భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడాలనుకుంటున్నారో అడిగి తెలుసుకొని, ప్రతి విద్యార్థి తన కలలను సాకారం చేసుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. పిల్లల ఆశయాలను అర్థం చేసుకొని, వారికి అవసరమైన ప్రోత్సాహం అందించడం తల్లిదండ్రుల ప్రధాన బాధ్యత అని తెలియజేశారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతిభ కలిగిన ప్రతి విద్యార్థికి తాము ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్.

## 6 లక్షల విలువ గల 8 ఫోన్లు స్వాధీనం.

తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, మే 11. తిరుపతి నగరంలో కూలి పనులు చేసుకుంటూ నటిస్తూ చోరీలు చేస్తున్న అంతర్రాష్ట్ర నేపాల్ దేశస్థుడిని తిరుపతి క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు నిందితుడి వద్ద నుండి 6 లక్షల విలువ గల 8 ఖరీదైన ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ని రిలయన్స్ మార్ట్ లో ఖరీదైన ఫోన్లు చోరీ కావడంతో క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. విచారణలో నేపాల్ దేశస్థుడైన అంతరాష్ట్ర దొంగను గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడు నేపాల్ దేశం కు చెందిన మహేష్ బహదూర్ జటారా ఏ సంతోష్ తాప, ఏ డాబా మహేష్ కుమార్ గా గుర్తించారు. జనవరి ఏప్రిల్ నెలల లో రామానుజన్ సర్కిల్ సమీపంలోని రిలయన్స్ మార్ట్ గోడదూకి లోపలికి ప్రవేశించి ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువులను అపహరించినట్లు పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా తిరుపతి బస్టాండు రైల్వే స్టేషన్ సత్రాల వద్ద పలు చోరీలు చేసినట్టు గుర్తించారు. నిందితుడు వద్ద నుండి శాంసంగ్,ఒప్పో,



వివో,వన్ ప్లస్, ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు కర్ణాటక పలు రాష్ట్రాలలో చోరీలకు పాల్పడి జైలు జీవితం గడిపినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచి రిమాండ్కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.

లాడ్జ్ యజమానులకు హెచ్చరిక.

తిరుపతి నగరంలోని లాడ్జ్ యజమానులకు సిబ్బందికి పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు ఇతరులకు రూము అద్దెకు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా వ్యక్తుల గుర్తింపు పత్రాలు పరిశీలించి గదులు కేటాయించాలని పోలీసులు కోరారు. నిబంధనలు పాటించని వారిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోబడతాయని లాడ్జి యజమానులకు హెచ్చరించారు.

# వివోఏలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!

## మహిళా సంఘాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే కాకర్ల..!
## మహిళా సాధికారతకు చంద్రబాబు కృషి మరువలేనిది : ఎమ్మెల్యే కాకర్ల సురేష్






(పెన్ పవర్ ప్రతినిధి వింజమూరు వింజమూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం నందు నిర్వహించిన ఉదయగిరి వెలుగు డిపార్ట్మెంట్ కు చెందిన వివోఏలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ హాజరై, ఉదయగిరి సెక్టార్‌కు చెందిన 20 మంది వివోఏలకు స్వయంగా స్మార్ట్ ఫోన్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు మాట్లాడుతూ, మహిళా సాధికారతకు పునాది వేసిన దూరదృష్టి కలిగిన నాయకుడు గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా స్వయం సమృద్ధి సాధించేలా డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన మహనీయుడు చంద్రబాబు నాయుడు గారేనని అన్నారు. గ్రామీణ మహిళల జీవితాల్లో వెలుగు నింపేందుకు, వారి కుటుంబాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

వెలుగు డిపార్ట్మెంట్‌లో సేవలందిస్తున్న వివోఏలు గ్రామస్థాయిలో మహిళా సంఘాలకు అండగా నిలుస్తూ కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. వారికి స్మార్ట్ ఫోన్లను అందించడం ద్వారా ప్రభుత్వ పథకాల అమలు మరింత వేగవంతం అవుతుందని, పనిలో పారదర్శకత పెరుగుతుందని, సమయపాలనతో పాటు పని ఒత్తిడి కూడా గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని గ్రామీణ మహిళలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు ఈ స్మార్ట్ ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. అదేవిధంగా, నిరుపేద మహిళల సమస్యలను గుర్తించి వారికి తక్షణ సహాయం అందించడంలో వివోఏల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే గారు అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి మహిళకు చేరవేయడంలో ఈ డిజిటల్ సౌకర్యాలు ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. అనంతరం వివోఏలు తమ వ్యక్తిగత సమస్యలు, ఉద్యోగరీత్యా ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు గ్రామస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను ఎమ్మెల్యే గారికి వివరించారు. ప్రతి సమస్యను ఓపికగా విన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు, వాటి పరిష్కారానికి తాను కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. వివోఏల సంక్షేమం, మహిళా సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

# మహానాడు కు ప్రతి నాయకుడు ప్రతి కార్యకర్త వచ్చి విజయవంతం చేయాలి

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మే 11. కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొడవలూరు మండలంలో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు ప్రతి నాయకుడు ప్రతి కార్యకర్త వచ్చి విజయవంతం చేయాలని బుచ్చిరెడ్డి పాలెం అర్బన్ పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు కోరారు స్థానిక కార్యాలయంలో ఆయన పలువురు నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పార్టీ ప్రతిష్ట ను ఇనుమడింపజేసే విధంగా ప్రతి ఒక్కరూ పాల్గొని సభను



విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశంలో బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వి శేషయ్య ఇంకా పలువురు నాయకులు కౌన్సిలర్లు పాల్గొన్నారు

# నేరాలపై మహిళలు ఏ సమయంలో నైనా సమాచారం ఇవ్వాల్సిందిగా

బుచ్చిరెడ్డిపాలెం పెన పవర్ మే 11. దామరమడుగు గ్రామంలో ఏర్పాటు చేసిన మహిళా సమావేశంలో పోలీసులు సూచించారు ఫోన్లో బ్యాలెన్స్ లేనప్పటికీ తాము ఇచ్చే నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో పాటు ఏ ప్రాంతంలో నుంచి ఫోన్ చేస్తున్నారు అన్న విషయం తెలిపితే నిమిషాల వ్యవధిలో తాము సంఘటన స్థలానికి చేరుకొని సాయం అందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు అదే గ్రామంలో మహిళా స్వయం ఉపాధి పథకాలపై అధికారులు శిక్షణ ఇచ్చారు, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్థానిక మహిళలకు సొంత నిధులతో కుట్టుమిషన్లు మరో పథకాన్ని సొంత వ్యయంతో ఇవ్వడం జరిగిందన్నారు వారికి శిక్షణ ఇచ్చే క్రమంలో మహిళలు ఏ విధంగా అదనపు ఆదాయం వచ్చేలా ఉపాధి పొందవచ్చును అన్నారు ఈ కార్యక్రమంలో ఆ గ్రామ నాయకులు యువకులు పాల్గొన్నారు



# ప్రభుత్వ సచివాలయాల్లో చోరీలు -- ఇంజినీరింగ్ విద్యార్థి అరెస్ట్

చిత్తూరు : పెన్ పవర్ మే 11: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన ఇంజినీరింగ్ విద్యార్థిని అరెస్ట్ చేసి , అతడు ప్రభుత్వ సచివాలయాల్లో చోరీలు చేసిన 30 ప్రింటర్లు, 3 ల్యాప్‌టాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పోలీసు అధికారి ఈ వివరాలను వెల్లడించారు. ముద్దాయిపై చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలలో 18 కేసులున్నాయి. ఈరోజు ఐపిఎస్ ఆదేశాల మేరకు .... చిత్తూరు జిల్లా ఎస్‌పి తుషార్ డూడి, నగరి ఇన్‌చార్జ్ డీఎస్పీ జె.రామ్‌బాబు పర్యవేక్షణలో, కార్వేటినగరం సిఐ, ఎస్.ఆర్.పురం ఎస్ఐ, సిబ్బంది ఎస్.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిత్తూరు--తిరుపతి ప్రధాన రహదారిపై మఠం క్రాస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడు సి.మహేష్‌బాబు (22) తండ్రి దొరబాబు, స్వగ్రామం కన్యాకాపురం గ్రామం, ఎస్.ఆర్.పురం మండలం, ప్రస్తుతం తిరుపతిలో నివాసం ఉంటున్నాడు. అతని వద్ద ఒక ప్రింటర్ ఉండగా, పోలీసులు తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను పలు ప్రభుత్వ సచివాలయాల్లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అనంతరం అతని వద్ద నుండి 30 దొంగిలించిన ప్రింటర్లు, ఒక బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు చిత్తూరు జిల్లా, తిరుపతి జిల్లా, అన్నమయ్య జిల్లాల్లోని ప్రభుత్వ సచివాలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. కట్టర్ సహాయంతో కార్యాలయాల తలుపులు పగులగొట్టి ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను దొంగిలించేవాడు. దొంగిలించిన వస్తువులను అమ్మి వచ్చిన డబ్బును ఆన్‌లైన్ బెట్టింగ్, విలాసవంతమైన జీవనానికి ఖర్చు చేసేవాడు. దొంగిలించిన ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లను ఒలాక్ష యాప్‌లో సెకండ్ హ్యాండ్ వస్తువులుగా అప్‌లోడ్ చేసి తక్కువ ధరలకు విక్రయించేవాడు. తక్కువ ధరలకు లభించడంతో కొనుగోలుదారులు సులభంగా కొనుగోలు చేసేవారని విచారణలో తెలిసింది.

ముద్దాయి వివరాలు ...



సి. మహేష్‌బాబు, వయస్సు 22 సంవత్సరాలు, తండ్రి దొరబాబు, కన్యాకాపురం గ్రామం, ఎస్.ఆర్.పురం మండలం, ప్రస్తుతం తిరుపతిలో నివాసం ఉంటున్నాడు.

విచారణలో అతని ప్రమేయం మొత్తం 18 కేసుల్లో ఉన్నట్లు నిర్ధారణ అయింది. అతను చేసిన అంతర్‌జిల్లా నేరాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి ...

చిత్తూరు జిల్లా -- 12 కేసులు

ఎస్.ఆర్.పురం మండలం -- 05 కేసులు

1. కొత్తపల్లి మిట్ట
2. నెలవాయి
3. శెట్టివానతం
4. ముడికుప్పం
5. కొత్తపల్లి మిట్ట ఆర్ఎస్‌కే
6. ఏ.ఎం.పురం సచివాలయం

వేదురుకుప్పం మండలం -- 03 కేసులు

# ప్రజల నుంచి వినతలు స్వీకరిస్తున్న తహసిల్దార్ యువరాజ్...




పెళ్లకూరు, పెన్ పవర్, మే 11 తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం పీజిఆర్ఎస్ (గ్రీవెన్స్ డే) సందర్భంగా సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి వినతలను స్వీకరిస్తున్న తహసిల్దార్ జి యువరాజ్.ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండలం ఇంచార్జ్ ఎంపీడీవో ప్రమీలరాణి,హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు,నాయుడుపేట వెటర్నరీ డాక్టర్ గోవర్ధన్ రెడ్డి,నాయుడుపేట అగ్రికల్చర్ ఏవో గణేష్, మరి ప్రజలు పాల్గొన్నారు.

# రాయల చెరువు నిర్వాసిత బాధ్యత రైతులను వెంటనే ఆదుకోవాలి..

## రాయలచెరువు కింద ఉన్న రైతులు సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి.రాజారెడ్డి







సూళ్లూరుపేట, పెన్ పవర్, మే 11 తిరుపతి జిల్లా కేవీపీ పురం మండలం ఒళ్లూరు రాయల చెరువు గండి కారణంగా చెరువు కింద ఉన్న పంట పొలాలు, పంటలు దెబ్బతిని ,రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగింది .రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాలు కొట్టుకుని పోయినాయి .అయినా ప్రభుత్వం సహాయం చేయకపోవడంతో భారతీయ కిసాన్ సంఘం తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కె వి బి పురం తాసిల్దార్ కార్యాలయం వద్ద ఈరోజు రైతులకు మద్దతుగా ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా భారతీయ కిసాన్ సంగ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి. రాజారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రైతులు తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే నెల రోజుల్లో సహాయం చేస్తామన్న అధికారులు మొహం దాటేసారని రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వారికి రావలసిన నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని ,చెరువుకు పడిన గండిని పూడ్చి సాగునీటినందించాలని చెరువు కింద రైతులు బ్యాంకులో తెచ్చుకున్న రుణాలను వెంటనే రద్దు చేయాలని కోరారు తిరుపతి జిల్లా అధ్యక్షులు ఇండ్ల శశి కిరణ్ మాట్లాడుతూ రైతు సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఈ నెలాఖరులో రైతులను కలుపుకునే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు తరువాత కిసాన్ సంఘ నాయకులు రైతులు తాసిల్దార్ని కలిసి వినతి పత్రం అందజేశారు .తాసిల్దార్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు సమస్యలను ఈ నెలాఖరులోగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు .రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ ఈ నెల లోపల సమస్యను పరిష్కరించుకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని రైతుల ఖాతాలో వారికి రావలసిన బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు విశ్రమించబోమని, రైతులకు అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి ,తిరుపతి జిల్లా అధ్యక్షులు ఇండ్ల శశికిరణ్, గోవిందయ్య, వెంకటాచలం, రామచంద్రారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 84 ఏళ్ల తల్లిని వేధిస్తున్న కూతుళ్లు, మనవడు.. అండగా నిలిచే వారు లేరా?

## కలెక్టర్ గారూ....మా ప్రాణాలు కాపాడండి...



PGRS - Collectorate Monday
Tirupati
172

| | | | |
|---|---|---|---|
| Grievance No | TPT202605111575 | అర్జీ నమోదు తేది | 11-05-2026 |
| అర్జీ విభాగము | Revenue (Ccla)-->Miscellaneous->Pathway Disputes | | |
| పేరు | KADURU MUNEMMA | ఫోను | 9515111133 |
| జిల్లా | Tirupati | మండలము | Pellakur |
| సచివాలయము | PELLAKURU-(R), 10990044 | ప్రస్తుత నివాసం | 3-15, 3-15, BASAVAIAHPALEM-(R), 11090832, Thottambedu, Tirupati |
| పరిష్కరించు అధికారి | Tahsildar, Pellakur | | |
| గడువు | 75 Day(s) | పరిష్కరించు గడువు తేది | 25-07-2026 |
| ఎన్రోల్మెంట్ ఆపరేటర్ | ఆపరేటర్-3, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, తిరుపతి | | |

గమనిక! మీ యొక్క ఫిర్యాదు స్థితి కొరకు 1100 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోను చేసి Grievance No చెప్పగలరు.

13:19




పెళ్లకూరు, పెన్ పవర్, మే 11 కన్నతల్లిని కంటికి రెప్పలా కాపాడాల్సింది పోయి, ఆమెకున్న కొద్దిపాటి ఆస్తిపై కన్నేసి వేధింపులకు గురిచేస్తున్న అమానవీయ ఘటన తిరుపతి జిల్లా పెళ్ళకూరు మండలంలో వెలుగుచూసింది. అనారోగ్యంతో ఉన్న 84 ఏళ్ల వృద్ధురాలు తన వైద్య ఖర్చుల కోసం ఆస్తి అమ్ముకుంటే, ఆమెను, కొన్న వారిని చంపేస్తామంటూ బెదిరింపులకు దిగడం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది.

వివరాల్లోకి వెళ్తే...

చెన్నప్పనాయుడుపేట గ్రామం పెళ్లకూరు మండలంకి చెందిన కదూరు మునెమ్మ (84)కు ఐదుగురు కుమార్తెలు. భర్త మరణానంతరం తనకున్న 5 ఎకరాల పొలాన్ని ఐదుగురు కుమార్తెలకు పంచగా, మిగిలిన ఒక ఎకరం తన పోషణ, వైద్య ఖర్చుల కోసం ఉంచుకుంది. నలుగురు కుమార్తెలు ఆమెను గాలికి వదిలేయగా, చిన్న కుమార్తె రామాయణం జ్యోతి మాత్రమే గత 30 ఏళ్లుగా తల్లిని సాకుతోంది.

వైద్య ఖర్చుల కోసం ఆస్తి విక్రయం.. అడ్డుకుంటున్న కన్నకూతుళ్లు

నడుము ఆపరేషన్ కోసం మునెమ్మ తన వాటాలోని 34 సెంట్ల భూమిని గతంలోనే అమ్ముకుంది. మిగిలిన 66 సెంట్లను 2013లో తనను సాకుతున్న మనవడు రామాయణం శేఖర్‌కు గిఫ్ట్ డీడ్ ద్వారా ఇచ్చింది. ప్రస్తుతం అత్యవసర వైద్య చికిత్సల కోసం ఆ పొలాన్ని ఏప్రిల్ 2026లో విక్రయించగా, అసలు సమస్య మొదలైంది.

చంపేస్తామంటూ బెదిరింపులు..

కులం పేరుతో బరితెగింపు

మునెమ్మ కుమార్తెలు ఆలం విజయమ్మ, చొక్కాని మల్లీశ్వరితో పాటు మనవడు ఆలం దొరబాబు, స్థానికుడు ఆరూరు సుబ్రహ్మణ్యం కలిసి వృద్ధురాలిని శారీరక, మానసిక వేధింపులకు గురిచేస్తున్నారు. “పొలం అమ్మే హక్కు నీకు లేదు.. పొలంలోకి వస్తే చంపేస్తాం” అంటూ బరితెగించి బెదిరింపులకు దిగుతున్నారని మునెమ్మ కలెక్టర్‌కు సమర్పించిన అర్జీలో ఆవేదన వ్యక్తం చేసింది. ముఖ్యంగా ఆరూరు సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి తన కులం పేరును అడ్డుపెట్టుకుని, చట్టపరంగా తనను ఎవరూ ఏమీ చేయలేరని,ఎవరికి చెప్పుకున్నా లెక్కలేదంటూ బహిరంగంగా హెచ్చరిస్తున్నట్లు పేర్కొంది.

కలెక్టర్ గారూ.. న్యాయం చేసేనా...

”తల్లిదండ్రులు మరియు సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం – 2007” ప్రకారం తన ఆస్తిపై తనకు పూర్తి హక్కు ఉందని, దానిని అడ్డుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మునెమ్మ జిల్లా కలెక్టర్‌ను వేడుకుంది. తన చివరి దశలో ప్రశాంతంగా, మందులకు ఇబ్బంది లేకుండా బ్రతికేలా పోలీసు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఆమె విన్నవించింది.?వృద్ధురాలి కన్నీటి గాథ విన్న జిల్లా యంత్రాంగం స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొంటారో లేదో వేచి చూడాల్సివుంది.

# మహానాడును మా ఇంటి పండుగలా నిర్వహిస్తాం -- కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి





కావలి: పెన్ పవర్ :( స్టాఫ్ రిపోర్టర్ )మే:11 నెల్లూరు జిల్లా, రాచర్లపాడు ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. మహానాడు వేదిక వద్ద జరుగుతున్న పనులను సోమవారం మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్సీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర జిల్లా ముఖ్య నేతలతో కలిసి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పరిశీలించారు. సభా ప్రాంగణం, వాహన పార్కింగ్, తాగునీటి సదుపాయాలు, భోజన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, వేదిక నిర్మాణం వంటి అంశాలను సమీక్షించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి మహానాడు ఎంతో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని అన్నారు. నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించడం ప్రతి కార్యకర్తకు గర్వకారణమని పేర్కొన్నారు. మహానాడును తమ ఇంటి పండుగలా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఏర్పాట్లు అన్ని వేగంగా జరుగుతున్నాయని, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహానాడు కార్యక్రమం నెల్లూరు జిల్లాలో జరగడం వైసిపి నాయకులకు జీర్ణించుకోవడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. “మా ఇంటి పండుగను మేము జరుపుకుంటుంటే మీకెందుకు బాధ” అంటూ వైసిపి నాయకులపై వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ బలాన్ని చూసి ప్రత్యర్థులు అల్లాడిపోతున్నారని అన్నారు. ప్రజల్లో టిడిపికి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి వైసిపి నేతలు భయపడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు మహానాడు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా కావలి నియోజకవర్గ ప్రజలు మహానాడును ప్రతి ఇంట్లో పండగలా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. మహానాడుకు భారీగా జనసమీకరణ చేపడుతున్నామని, నియోజకవర్గం నుంచి వేలాదిమంది కార్యకర్తలు, అభిమానులు పాల్గొంటారని వెల్లడించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహానాడు ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వబడుతుందని తెలిపారు. మహానాడు విజయవంతం కోసం ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు




నెల్లూరు, మే 11, పెన్ పవర్ ప్రతినిధి పేద ప్రజలకు అందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వెంకటాచలం సీతారాం టోల్‌ప్లాజా వద్ద సివిల్ సప్లైస్ శాఖ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ాూా 39 ు 3519 నంబరు గల లారీలో సుమారు 33 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ బియ్యం గుంటూరు జిల్లా నుంచి తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న లారీతో పాటు పీడీఎస్ బియ్యాన్ని సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో భద్రపరిచి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పీడీఎస్ సరుకుల అక్రమ రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతుందని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సి. లక్ష్మీనారాయణ రెడ్డి, అసిస్టెంట్ సప్లై ఆఫీసర్, నెల్లూరు, సైమన్ బాబు, సి ఎస్ టి టి వెంకటాచలం, వెంకటేశ్వర్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, నెల్లూరు, సురేష్, జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

# నెల్లూరుకు ‘మహానాడు’ మన జిల్లా నాయకుల అదృష్టం: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి... మహానాడు ప్రతి కార్యకర్తకు పండుగ..





నెల్లూరు ( పెన్ పవర్ ప్రతినిధి మే 11 ): తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ‘మహానాడు’ కార్యక్రమం ఈసారి నెల్లూరు లో జరగనుండటం జిల్లాలోని నాయకులకు, కార్యకర్తలకు దక్కిన గొప్ప అదృష్టమని కోవూరు శాసనసభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పొంగూరు నారాయణతో కలిసి ఆమె కోవూరు నియోజకవర్గ పరిధిలోని కిసాన్ సెజ్ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న సభా స్థలిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యకర్తల పండుగైన మహానాడును ఒక మహా యజ్ఞంలా భావించి, అందరం కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా మంత్రులు శ్రీ పొంగూరు నారాయణ, శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గార్ల తో పాటు జిల్లా లోని శాసన సభ్యులు,ఎమ్మెల్సీ లు సమన్వయంతో, నాయకులందరి సమిష్టి కృషితో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.నెల్లూరులో తొలిసారిగా జరుగుతున్న ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు శ్రేణులన్నీ సమాయత్తం కావాలని వారు కోరారు. ఇప్పటికే ఈనెల 6వ తేదీన మహానాడు వేదిక కోసం భూమి పూజ నిర్వహించామని, ఈనెల 13న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం జరగనుందని తెలిపారు. ఈ సమావేశంలో సభ ఏర్పాట్లకు సంబంధించి వివిధ విభాగాల

బాధ్యతలను నాయకులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, టిడిపి జోనల్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ క్షేత్రం,

## బుచ్చిరెడ్డిపాలెం మండలం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీవార్ల బ్రహ్మోత్సవములు సందర్భముగా ఐదవ రోజు సోమవారం ఉదయం తిరుచా ఉత్సవం పై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు.



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మే 11 . శ్రీశైలం రామ్మూర్తి కుమారులు, జొన్నవాడ వారు ఉభయకర్త లుగా వ్యవహరించారు. రాత్రి సింహ వాహన సేవ వాహనం పై శ్రీ కామాక్షి తాయి అమ్మవారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. జొన్నవాడ వాస్తవ్యులు కందికట్టు కామేశ్వర రావు కుమారులు శివకుమార్ కె సుబ్బారావు కె వెంకట రమణయ్య ఉభయకర్త లుగా వ్యవహరించారు. సింహ వాహనంపై శ్రీ కామాక్షి తాయి అమ్మవారు విహరించడం శక్తి, పరాక్రమం, ధర్మ సంరక్షణకు ప్రతీకగా భావించబడుతుంది. జగజ్జనని అయిన అమ్మవారు సింహంపై దర్శనమివ్వడం ద్వారా భక్తులలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, భయ నివారణ కలుగుతాయని విశ్వాసం. సింహం దేవీ మహాశక్తికి వాహనంగా ప్రసిద్ధి చెందింది. దుర్గాదేవి స్వరూపిణిగా కామాక్షితాయి అమ్మవారు సింహవాహనంపై ఆలయ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కరుణాకటాక్షాలు ప్రసాదిస్తారు. వేదఘోషలు, మంగళవాయిద్యాలు, శివనామస్మరణల మధ్య జరిగే ఈ సేవ భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తుతుంది. సింహ వాహన సేవ సందర్భంగా భక్తుల కాలక్షేపం కొరకు ఏర్పాటు చేసిన కోలాటం, కూచిపూడి నృత్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పాలక మండలి సభ్యులు నక్కల శివ కృష్ణ జొన్నలగడ్డ వరలక్ష్మి పెన్నత్తురు సుమలత పాలూరు చాముండేశ్వరి కీలుకుప్ప శ్రీనివాసులు రామాయణం సుధారాణి, ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు, మజ్జిగ చలివేంద్రం, ఉచిత ప్రసాద వితరణ, పందిర్లు, అన్నప్రసాదం, దర్శన క్యూ లైన్ తదితర ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.తిరుమూరు అశోక్ రెడ్డి చైర్మన్ మరియు ధర్మకర్త మండల సభ్యులు అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

# ఖరీఫ్ వేళ... నకిలీ విత్తనాల గోల ..!

ఆత్మకూరు (అనంతపురం) : పెన్ పవర్ మే 11:జిల్లాలో రైతుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. ఒకవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతుంటే మరోవైపు నకిలీ విత్తనాల సమస్య మరింత జటిలంగా మారింది. ఖరీఫ్ కు ముందు చాలా కంపెనీలు వచ్చి రైతులకు విత్తనాలు ఇచ్చి వెళుతుంటాయి. అయితే ఆ విత్తనాలు నాసిరకమైనవిగా ఉంటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి సగంపైగా పంట ఉండటం లేదని నిత్యం అధికారుల ముందు తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. విత్తనాల కంపెనీల సిబ్బందిని అడిగితే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగుకు ముందు నగరంలో ఆఫీస్ ఓపెన్ చేయడం వాళ్ళ బిజినెస్ అయిపోయాక మొఖం చాటేస్తున్నారు. 20 నుండి 30 కంపెనీలు రైతుల చుట్టూ తిరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది.

# సంగం బ్యారేజీ నుంచి కావలి కాలువకు రెండో పంటకు సాగునీరు విడుదల చేసిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి..

## చివరి ఆయకట్టు వరకూ నీరు అందిస్తామని రైతులకు హామీ..
## యూరియా కొరత లేదని ధైర్యంగా నారుమడులు వేసుకోవాలని సూచన..
## సాగునీటి విడుదలతో కావలి ప్రాంత రైతుల్లో ఆనందం వ్యక్తమైంది..
## కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి





పెన్ పవర్ : (స్టాఫ్ రిపోర్టర్ ) మే:11 కావలి నియోజకవర్గ రైతాంగానికి నీరు అందించేందుకు నెల్లూరు జిల్లా, సంగం బ్యారేజీ నుంచి కావలి కాలువకు రెండో పంటకు సాగునీటిని సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, సాగునీటి శాఖ అధికారులు, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు. ముందుగా కాలువ వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అనంతరం కాలువకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రాష్ట్రంలో ప్రతి రైతు ఆనందంగా ఉండేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతుల సంక్షేమం కోసం సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కావలి కాలువ చివరి ఆయకట్టు వరకూ ప్రతి రైతుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చివరి రైతు వరకూ నీరు చేరే బాధ్యతను తాను తీసుకుంటానని స్పష్టం చేశారు.రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా ధైర్యంగా నారుమడులు వేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, యూరియా కొరతపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అన్నదాతలు పుష్కలంగా పంటలు పండించి సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.సాగునీరు విడుదల కావడంతో కావలి పరిసర ప్రాంత రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. సమయానికి నీరు విడుదల చేయడంతో వరి సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల పట్ల మానవతా దృక్పథంతో చలివేంద్రాలు ఏర్పాటు... కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం..





విజయవాడ, పెన్ పవర్, మే, 11, కొండపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ మరియు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ శ్రీ చెన్నుబోయిన చిట్టిబాబు పేర్కొన్నారు. ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న ఈ సమయంలో ప్రజలకు చల్లని తాగునీరు, మజ్జిగ అందించడం గొప్ప సేవ అని ఆయన అన్నారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకుని ఎల్లప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందుండే నాయకుడు మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాంరేనని కొనియాడారు. ప్రజల పట్ల మానవతా దృక్పథంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా కేడీసీసీ బ్యాంకు సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ కొప్పుల స్వరూప , స్థానిక నాయకులు, కార్యకర్తలు, కేడీసీసీ బ్యాంకు సిబ్బంది మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏపీకాస్ట్ ప్రాంతీయ సైన్స్ సెంటర్‌లో జాతీయ సాంకేతిక దినోత్సవం..





విజయవాడ, పెన్ పవర్, మే, 11, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అపకాస్ట్ ) పరిధిలోని ఏపీకాస్ట్ -- ప్రాంతీయ సైన్స్ సెంటర్, విజయవాడలో జాతీయ సాంకేతిక దినోత్సవం 2026 వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అపకాస్ట్ ) సభ్య కార్యదర్శి డా. కె. శరత్ కుమార్, ఇతర ప్రముఖులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా విద్యార్థుల కోసం వివిధ పోటీలు, పోస్టర్ ప్రదర్శనలు, శాస్త్ర సాంకేతిక అవగాహన కార్యక్రమాలు మరియు పరస్పర చర్చా కార్యక్రమాలు నిర్వహించగా, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా డా. జి. లక్ష్మీశ ప్రాంతీయ సైన్స్ సెంటర్‌లోని ప్రదర్శనలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథం మరియు సృజనాత్మకతను అభినందించారు. సమాజ అభివృద్ధి మరియు దేశ ప్రగతికి శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సభను ఉద్దేశించి మాట్లాడిన డా. జి. లక్ష్మీశ ఆధునిక సమాజంలో సాంకేతికత యొక్క ప్రాధాన్యతను వివరించారు. దేశ నిర్మాణం, సామాజిక అభివృద్ధి మరియు నవీన ఆవిష్కరణల కోసం విద్యార్థులు శాస్త్ర సాంకేతికతను వినియోగించాలని ప్రేరణనిచ్చారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు మరియు పాల్గొన్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ కార్యక్రమం ముగిసింది.

# కేంద్ర రైల్వే మంత్రితో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు భేటీ - – పల్నాడు రైల్వే అభివృద్ధికి కీలక వినతులు



నరసరావుపేట, పెన్ పవర్ మే 11: నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం న్యూ ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు ప్రాంతంలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రయాణికుల సౌకర్యాల పెంపు లక్ష్యంగా పలు ముఖ్యమైన ప్రతిపాదనలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మూడు ప్రధాన అంశాలపై వినతి పత్రాలను సమర్పించారు. పల్నాడు ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా పిడుగురాళ్ల -- రామాయపట్నం పోర్ట్ నూతన రైల్వే లైన్ నిర్మాణం అత్యవసరమని తెలిపారు. ఈ లైన్ ద్వారా సిమెంట్, సున్నపురాయి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభమవుతుందని, లాజిస్టిక్స్ రంగానికి ఊతమిచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. అలాగే పల్నాడు జిల్లా నుంచి బెంగళూరుకు పెద్ద సంఖ్యలో ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు ప్రయాణిస్తున్న నేపథ్యంలో, విజయవాడ -- బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించాల్సిందిగా కోరారు. ఈ రైలు ద్వారా ప్రయాణ సమయం తగ్గడంతో పాటు అత్యాధునిక సౌకర్యాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇక ప్రజల సౌకర్యార్థం, ప్రస్తుతం నడుస్తున్న సికింద్రాబాద్ -- తిరుపతి వందే భారత్ (20701), లింగంపల్లి -- విజయవాడ ఎక్స్‌ప్రెస్ (12796) రైళ్లకు నడికుడి లేదా పిడుగురాళ్ల రైల్వే స్టేషన్లలో స్టాపేజ్ కల్పించాలనే విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ, పల్నాడు ప్రాంత రైల్వే అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పల్నాడు ప్రాంత ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ వినతులు సమర్పించామని, త్వరలోనే అనుకూల నిర్ణయాలు వెలువడతాయని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# గడప గడపకు బిజెపి కార్యక్రమం.. చెరుకూరి తిరుపతిరావు.




గుంటూరు, పెన్ పవర్, మే, 11, గుంటూరు సిటీ 14 వ మండలం లో బారతీయ జనతా పార్టీ కార్యకర్తలు గడప గడపకు బిజెపి కార్యక్రమం చేస్తున్న సందర్భంగా బిజెపి నాయకుల పర్యటన చేసే సమయంలో చింతా వారి వీధి నందు సమస్యలను తెలుసుకోవటం జరుగుతున్న సమయంలో ఒక చిరు వ్యాపారి పచ్చి పులుసు శ్రీనివాసరావు సైకిల్ పై బట్టలు వ్యాపారం చేస్తూ వయోభారంతో వృద్ధాప్యం వచ్చినందున మోకాళ్ళు నెప్పులు తో బాధపడుతూ సైకిల్ తొక్కలేని పరిస్థితిలో భార్య చనిపోయినది అని తోపుడు బండి ఉ ంటే వ్యాపారం చేసుకుంటాను ఏదైనా సహాయం చేయమని అభ్యర్ధన మేరకు పోతురాజు వెంకట్ స్పందించి అభయ ఫౌండేషన్ ద్వారా అమెరికా వాస్తవ్యులు ఇమిడిశెట్టి సురేఖ గారు వారి ఆర్థిక సహకారంతో వారికి నాలుగు చక్రాల తోపుడు బండి ₹10,000/-రిమరియు వస్తువులు కొనుగోలు నిమిత్తం ₹5,000/-రిల బట్టలు అందజేయడం జరిగింది. నాలుగు చక్రాల బండి మరియు బట్టలు ఏర్పాటు చేసినందుకు సంస్థ వారికి సహాయం చేసిన డోనార్ కి నేను జీవితాంతం రుణపడి ఉంటాను అని వారు చేసిన మేలు ఎప్పటికీ మరువబోనని వారి కుటుంబం అష్టైశ్వర్యాలతో భోగభాగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ బీజేపీ ఎప్పుడు ప్రజలకు సేవ చేస్తూ ప్రజా శంషేమమే కోరుకుంటున్నది అని మాట్లాడుతూ దాతలకు కృతజ్ఞతలు తెలియచెప్పినారు సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, శనక్కాయల ఉమాశంకర్, పోతురాజు వెంకట్, దేసు సత్యనారాయణ, రఫీ, సురేష్ జైన్, మోతే వెంకట శేషగిరిరావు, బాబూరావు, కె.శ్రీనివాసరావు మరియు నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు మొదలగువారు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేసినారు.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..




విజయవాడ, పెన్ పవర్, మే, 11, ఈ నెల 21న ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని.. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ) సమావేశం జరిగింది. మే 21 నుంచి జూన్ 4వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 57 కేంద్రాల్లో థియరీ పరీక్షలు నిర్వహించాల్సి ఉ ందని.. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరానికి సంబంధించి 23,316 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 14,819 మంది మొత్తం 38,135 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా విజయవాడలోని ఒక కేంద్రంలో రెండు సెషన్లలో జూన్ 7 నుంచి 11వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని.. వీటిని కూడా సజావుగా పూర్తిచేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని.. నో సెల్ ఫోన్ జోన్ మార్గదర్శకాలు పాటించాలన్నారు. కంట్రోల్ రూమ్, స్ట్రాంగ్ రూమ్‌లకు నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. థియరీ పరీక్షలకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లు, మూడు సిటింగ్ స్క్వాడ్లను నియమించాలన్నారు. అవసరమైన ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందితో పాటు బందోబస్తు, పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లి వచ్చేందుకు బస్సు సౌకర్యం తదితరాలపై ఆయా శాఖల అధికారులు ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రణాళికాయుతంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈవో) బి.ప్రభాకరరావు, డీఈసీ సభ్యులు జి.ఝాన్సి, ఎన్.వెంకటరావు, డిస్ట్రిక్ట్ బల్క్ ఇన్‌ఛార్జ్ డా. జీజేవీఎస్ఎన్‌డీ లక్ష్మి, డీఈవో ఎల్.చంద్రకళ, డీపీవో పి.లావణ్యకుమారి, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు...

# నరసరావుపేటలో డ్వాక్రా లోన్ మోసం వ్యవహారంపై మహిళ ఫిర్యాదు



నరసరావుపేట, పెన్ పవర్ మే 11: పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి చెందిన కంచర్ల సుజాత అనే మహిళ సోమవారం జిల్లా ఎస్పీ కృష్ణారావును కలిసి తనపై జరిగిన ఆర్థిక మోసం విషయమై ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల ప్రకారం, సమైక్య లీడర్‌గా వ్యవహరిస్తున్న మల్లెల అనిల తనకు తెలియకుండా ఆమె పేరు మీద నాలుగు డ్వాక్రా గ్రూపులు సృష్టించి సుమారు రూ.10 లక్షల వరకు రుణం తీసుకున్నట్లు ఆరోపించారు. ఇటీవల బ్యాంకు అధికారుల నుండి నోటీసులు రావడంతో తన పేరు మీద లోన్లు ఉన్న విషయం తెలిసిందని సుజాత తెలిపింది. ఈ విషయమై అనిలను ప్రశ్నించగా, తానే రుణం చెల్లిస్తానని చెప్పి గత రెండు సంవత్సరాలుగా కాలయాపన చేస్తూ వస్తోందని పేర్కొంది. ప్రస్తుతం రుణం చెల్లించాలని అడగగా అనిల అసభ్య పదజాలంతో దూషిస్తున్నట్లు బాధితురాలు ఆరోపించింది. ఈ నేపథ్యంలో మల్లెల అనిలపై తగిన చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీని వేడుకుంది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. సంబంధిత ఆధారాలు సేకరించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలకి పోలీస్ వారి సూచన: ఎవరైనా మీ అనుమతి లేకుండా మీ పేరుతో ఆర్థిక లావాదేవీలు జరిపినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

# సొంత పార్టీ నేతపైనే దాడి

## మాజీ మంత్రి విడదల రజినిపై వైఎస్సార్సీపీ నేత శ్రీకాంత్ సంచలన ఆరోపణలు




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే 11: చిలకలూరిపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నకిరికంటి శ్రీకాంత్ ఈ నెల 3వ తేదీ రాత్రి తనపై జరిగిన దాడి గురించి రజక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి విడదల రజిని ప్రోద్బలంతోనే తనపై ఈ దాడి జరిగిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.గతంలో ఒక నర్సు పోస్ట్ బదిలీ కోసం తాను మూడు లక్షల రూపాయలు ఇచ్చానని, ఆ పని కాకపోవడంతో డబ్బులు తిరిగి అడిగినందుకే తనను లక్ష్యంగా చేసుకున్నారని శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. విడదల రజిని అనుచరుడు, పల్నాడు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కందుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నర్సరావుపేట, సాతులూరు, గోవిందపురం ప్రాంతాల నుండి మనుషులను తీసుకొచ్చి రడ్లు, బీరు సీసాలతో తనపై దాడి చేయించారని ఆయన పేర్కొన్నారు. ఈ దాడిలో మొత్తం 12 మంది పాల్గొనగా, అందులో ఏడుగురు మాస్కులు, ఐదుగురు కర్చీఫ్‌లు కట్టుకున్నారని వారిలో కుప్పల ప్రభుదాసు నాయుడు, అన్నపురెడ్డి దుర్గాప్రసాద్‌లను తాను స్పష్టంగా గుర్తించానని సరైన విచారణ జరపకుండానే నామమాత్రపు సెక్షన్లతో కేసు నమోదు చేశారని ప్రస్తుతం కంటికి తగిలిన తీవ్ర గాయం కారణంగా గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తనకు, సీఐ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. తన వద్ద దాడికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ సాక్ష్యాలు కూడా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలపైనే ఇలా దాడులు చేయించడం దారుణమని, మాజీ మంత్రి మరియు ఆమె అనుచరుల నుండి తనకు ప్రాణహాని ఉందని శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి వంటి నేతలు తనను పరామర్శించారని, త్వరలోనే ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఒకవేళ తనకు న్యాయం జరగని పక్షంలో ఎస్పీ, ఐజీ కార్యాలయాల ముందు ఆందోళన చేస్తానని, అవసరమైతే తాడేపల్లి పార్టీ కార్యాలయానికి వెళ్లి అన్ని విషయాలు బయటపెడతానని ఆయన హెచ్చరించారు.

# సమస్య పరిష్కారంలో అర్జీదారుని సంతృప్తే ప్రధానం...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..



విజయవాడ, పెన్ పవర్, మే, 11, జిల్లాలో ప్రజల నుంచి అందుతున్న అర్జీలను అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, సమస్యల స్వరూపాన్ని పూర్తిగా అర్థం చేసుకుని శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అర్జీదారుని సంతృప్తే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. మొత్తం 160 అర్జీలు అందగా.. వీటిలో రెవెన్యూ 40, పోలీస్ 23, ఎంఏయూడీ 28, పంచాయతీరాజ్ 10, వైద్య ఆరోగ్యం 8, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు 6, విద్యుత్ 5, డీఆర్‌డీఏ 4, ఏపీఎస్ ఆర్‌టీసీ 4, విద్య 4, పౌర సరఫరాలు 3, రవాణా 2, ఎస్సి కార్పొరేషన్ 2, విభిన్న ప్రతిభావంతులు 2, మార్కెటింగ్ 2, డ్వామా 2, హౌసింగ్ 2, మత్స్య 2, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు, మైన్స్, ఉపాధి, సమాచార పౌర సంబంధాలు, ఇరిగేషన్, కార్మిక, దేవాదాయ, బ్యాంకింగ్‌కు సంబంధించి ఒక్కో ఆర్జీ స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి రాకుండా ప్రతి అర్జీపై సమగ్రంగా విచారణ చేసి, స్పష్టతతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అర్జీని కేవలం విధి నిర్వహణగా కాకుండా మానవతా దృక్పథంతో పరిశీలించాలని, సమస్య పరిష్కారానికి అవసరమైన శాఖల మధ్య సమన్వయం ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు..

# ఫలించిన ఎమ్మెల్యే నసీర్ కృషి





గుంటూరు, పెన్ పవర్, మే, 11, గుంటూరు ప్రభుత్వాస్పత్రిలోని నాట్కో సెంటర్ లో పెట్ స్కాన్ ఏర్పాటుకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ చేసిన కృషి ఫలించింది. ఇప్పటికే క్యాన్సర్ వైద్యంలో రాష్ట్రానికే తలమానికంగా ఉన్న జీజీహెచ్ లోని నాట్కో సెంటర్ ఇకపై మరింత అధునాతన సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. నాట్కో సెంటర్ లో పెట్ స్కాన్ కోసం గతంలో అసెంబ్లీలోనూ, వైద్యశాఖ మంత్రి వద్ద ఎమ్మెల్యే నసీర్ అనేక సార్లు విన్నవించారు. ఈ మేరకు నాట్కో విభాగంలో ఈ నెల 14వ తేదీన పెట్ స్కాన్ సెంటర్ ప్రారంభించనున్నారు. సోమవారం దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. పెట్ స్కాన్ ద్వారా ఎంత సమయంలో రిపోర్టులు వస్తాయి ? ఎలాంటి రోగాలను గుర్తించే అవకాశం ఉంటుంది ? ప్రతి రోజు ఎంత మందికి స్కాన్ చేసే సామర్థ్యం ఉంటుంది ? దీనికి సంబంధించిన సిబ్బంది వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు ప్రభుత్వాస్పత్రి నాట్కో సెంటర్ లో క్యాన్సర్ రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 120 పడకలతో క్యాన్సర్ పేషెంట్లకు సేవలందిస్తున్నారని, తాజాగా మరో 130 పడకలను అందుబాటులోకి తీసుకొస్తున్నారని చెప్పారు. గతంలో క్యాన్సర్ ను రాచపుండుగా నిలిచే వారని, ఈ వ్యాధికి గురైన రోగికి ఇక నయం కాదనే ఉద్దేశంతో ఉండేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీజీహెచ్ లో అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. రూ.20 కోట్లతో ఏర్పాటు చేయనున్న పెట్ స్కాన్ ద్వారా ఏడాదిన్నరపాటు ఉచితంగా రోగులకు సేవలందించనున్నట్లు తెలిపారు. ఒక్కో స్కాన్ విలువ రూ.25 వేలు ఉంటుందన్నారు. ఈ నెల 14న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి ప్రారంభిస్తామని తెలిపారు.

## బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితమ్మ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేసిన ఏపీ రాష్ట్ర నగరాలు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు,





పెన్ పవర్, మే, 11 ఈరోజు అనగా ది.11/05/2026 సోమవారం ఉదయం ఏపీ రాష్ట్ర నగరాలు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు తెలుగు యువత బీసీ సంక్షేమ సంఘం నాయకులు బిసి సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ఎస్ సవితను క్యాంప్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి నగరాల కార్పొరేషన్ కి సంబంధించి ముఖ్యమైన అంశాలను వినతిపత్రం ద్వారా అందజేశారు.

( 1) నగరాలు సామాజిక వర్గాన్ని బీసీ-(డీ) నుండి బీసీ-(ఏ) లోకి మార్చాలని కోరారు.

(2) కులగణాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా దామాషా లెక్కల ప్రకారంగా తక్కువగా ఉన్న నగరాల కులం అతి చిన్న సామాజిక వర్గం అయి ఉండడం వల్ల బీసీ-డీ లో ఉన్నందువలన మిగిలిన వెనుకబడిన సామాజిక వర్గాల పోటీతో విద్య, ఉద్యోగ రాజకీయ సమీకరణాల్లో తమ సామాజిక వర్గానికి చెందవలసిన రిజర్వేషన్ నందు తీవ్రమైన పోటీ తత్వం నెలకొందని తద్వారా తాము మరింత వెనుకబడి పోతున్నామని తెలియజేశారు.

(3)ఏపీ రాష్ట్ర నగరాలు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లో ఖాళీగా ఉన్న చైర్మన్ మరియు డైరెక్టర్ పదవులను త్వరితగతిన భర్తీ చేయాలని, తద్వారా నగరాల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు దామాషా ప్రకారం బిసి సబ్ ప్లాన్ నిధులను విడుదల చేయాలని కోరడం జరిగింది.

(4) జనాభా పరంగా అతి చిన్న కులమైన నగరాల సామాజిక వర్గానికి బీసీ రక్షణ చట్టం వర్తించే ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.!!లి ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బెవర సాయి సుధాకర్ సుఖాశి కిరణ్ కుమార్ పిళ్ళా కన్నమ నాయుడు పిళ్ళా సూరిబాబు కరణం దివాకర్ బాబు నల్లాన వెంకునాయుడు. తెలుగు యువత జిల్లా సెక్రటరీ పైలా సతీష్ బంకా సురేష్ బొల్లు ప్రసాద్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.!!

# గణపవరంలో క్షుద్ర పూజల కలకలం : భయాందోళనలో గ్రామస్థులు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే 11: నాదెండ్ల: మండలంలోని గణపవరం గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం రేపుతున్నాయి. పొలానికి వెళ్లే కాలువ గట్టు పక్కన గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయాల్లో ఈ పూజలు నిర్వహిస్తుండటం స్థానికంగా తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. నెలకు కనీసం ఒక్కసారైనా ఇలాంటి పూజలు జరుగుతున్నాయని, ఉదయం పొలాలకు వెళ్లే రైతులకు పూజా సామాగ్రి, నిమ్మకాయలు, పసుపు, కుంకుమలు కనిపిస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. నిత్యం పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఈ అఘాయిత్యాలతో అడుగు బయట పెట్టాలంటేనే వణికిపోతున్నారు. ఇలాంటి మూఢనమ్మకాలతో గ్రామ వాతావరణాన్ని పాడు చేస్తున్న వారిని గుర్తించి, అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# పేటలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం: అర్బన్ సిఐ రమేష్



చిలకలూరిపేటరూరల్, పెన్ పవర్, మే 11: చిలకలూరిపేట: మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినంసందర్భంగా ఈనెల 29వ తేదీన పట్టణంలో భారీ ఉచిత మెగాకంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చిలకలూరిపేట అర్బన్ సిఐ రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియా ద్వారా పట్టణ మరియు నియోజకవర్గ ప్రజలకు శిబిరం వివరాలను వెల్లడించారు.గత 30 ఏళ్లుగా నిరంతరాయంగా జరుగుతున్న ఈ సేవలో భాగంగా, ఇది 43వ మెగా కంటి వైద్య శిబిరం అని ఆయన పేర్కొన్నారు. చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ప్రత్తిపాటి గార్డెన్స్ నందు ఈ శిబిరం ఏర్పాటు చేయబడుతుంది. కంటి శుక్లాలు, పొరలు మరియు రెటీనా సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శంకర కంటి ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్యం అందజేయనున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చే ప్రజల సౌకర్యార్థంఆరోజు మధ్యాహ్నంఉచిత భోజన సదుపాయం కూడా కల్పించినట్లు ఆయన వివరించారు. కంటి సమస్యలతో ఇబ్బంది పడే ప్రజలందరూ ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకుని, తమచూపును మెరుగుపరుచుకోవాలని సిఐ రమేష్ కోరారు.

## ఆర్టీసీ సిబ్బంది ధర్నా: నిలిచిపోయిన బస్సులు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మే 11: చిలకలూరిపేట : పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. డ్రైవర్, కండక్టర్లపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు మెరుపు ధర్నాకు దిగారు. డిపో నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డుకుని, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. డిపో మేనేజర్ వేణు రంగంలోకి దిగి సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, న్యాయం జరిగే వరకు బస్సులు కదిపేది లేదని కార్మికులు భీష్మించుకోవడంతో ఆందోళన కొనసాగుతోంది. ఆర్టీసీ డ్రైవర్ల ఆకస్మిక సమ్మెతో చిలకలూరిపేట బస్టాండ్ ఒక్కసారిగా బోరుమంది. బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి బస్సుల కోసం వేచి చూస్తున్న మహిళా ప్రయాణికులు, తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేక బస్టాండ్‌లోనే అవస్థలు పడుతున్నారు.

# ఖరీఫ్ వేళ... నకిలీ విత్తనాల గోల ..!




ఆత్మకూరు (అనంతపురం) : పెన్ పవర్, మే, 11 జిల్లాలో రైతుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. ఒకవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతుంటే మరోవైపు నకిలీ విత్తనాల సమస్య మరింత జటిలంగా మారింది. ఖరీఫ్ కు ముందు చాలా కంపెనీలు వచ్చి రైతులకు విత్తనాలు ఇచ్చి వెళుతుంటాయి. అయితే ఆ విత్తనాలు నాసిరకమైనవిగా ఉంటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి సగంపైగా పంట ఉండటం లేదని నిత్యం అధికారుల ముందు తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. విత్తనాల కంపెనీల సిబ్బందిని అడిగితే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగుకు ముందు నగరంలో ఆఫీస్ ఓపెన్ చేయడం వాళ్ళ బిజినెస్ అయిపోయాక మొఖం చాటేస్తున్నారు. 20 నుండి 30 కంపెనీలు రైతుల చుట్టూ తిరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. జిల్లాలో ప్రధాన పంటలుగా పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి, ఉల్లి, మిర్చి 4 లక్షల హెక్టార్లలో సాగుచేస్తున్నారు. జులై నెల మధ్య వరకు దాదాపు 2 లక్షల హెక్టర్ల పంట సాగులోకి రాగా, ఆగస్టు చివరికల్లా 4 లక్షల హెక్టర్ల పంట సాగుకు సిద్ధం అవుతుంది. 2024 నుండి 2025 మధ్యలో దాదాపు 1 లక్ష ఎకరాల పంట నకిలీ విత్తనాల పాలైంది.

# సిద్ధమైన కృష్ణాజలాల ప్రాజెక్టు

**విజయవాడ, మే 11, పెన్ పవర్:** ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలోని కిడ్నీ బాధిత గ్రామాలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలను అందించే ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. సుమారు 15 తండాల్లోని 57 వేల మంది జనాభాకు ప్రతిరోజూ 22 లక్షల లీటర్ల నీటిని అందించేలా కుదప సంపు నుంచి పైప్‌లైన్ నిర్మించారు. గత పదేళ్లుగా కిడ్నీ వ్యాధులతో వందలాది మంది మరణించిన ఈ ప్రాంతంలో.. సురక్షిత నీటి సరఫరా ద్వారా వ్యాధులను అరికట్టడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా.. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని అధికారికంగా ప్రారంభించనున్నారు.ఎన్టీఆర్ జిల్లాలోని ఎ కొండూరు మండలం అంటేనే కిడ్నీ వ్యాధులకు నిలయంగా మారిపోయిన దుస్థితి. ఇక్కడి భూగర్భ జలాల్లో ఉన్న ఫ్లోరైడ్, ఇతర రసాయనాల కారణంగా వందలాది మంది గిరిజనులు కిడ్నీ వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ కిడ్నీ మరణాల పరంపరకు అడ్డుకట్ట వేయాలంటే సురక్షితమైన మంచినీటి సరఫరా ఒక్కటే మార్గమని దశాబ్ద కాలంగా బాధితులు మొరపెట్టుకుంటున్నారు. ఎట్టకేలకు ఈ ప్రాంత వాసుల కల నెరవేరుస్తూ.. కృష్ణా నది జలాలను తరలించే ప్రాజెక్టు నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తి చేసింది, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలోనే ఈ మండలంలో సుమారు 250 మందికి పైగా కిడ్నీ వ్యాధులతో మరణించారని గణాంకాలు చెబుతున్నాయి. ప్రాజెక్టు పనులు అప్పట్లో మందకొడిగా సాగడంతో కిడ్నీ బాధితుల వెతలు తీరలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా గుర్తించి ఆఖరి దశలో ఎదురైన సాంకేతిక సమస్యలను పరిష్కరించింది. కుదప సంపు నుంచి పది కిలోమీటర్ల పొడవైన భారీ పైప్‌లైన్ ద్వారా కృష్ణా జలాలను ఎ.కొండూరు మండలానికి తరలిస్తున్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని నిల్వ చేసేందుకు తండాల్లో ఉన్న 44 పాత ట్యాంకులను పునరుద్ధరించడంతో పాటు కొత్తగా మరో 12 ట్యాంకులను నిర్మించారు. మొత్తం 56 ట్యాంకుల ద్వారా గిరిజన తండాల్లోని ఇంటింటికీ నీటిని పంపిణీ చేయనున్నారు. ప్రారంభంలో కొత్తగా నిర్మించిన నాలుగు ట్యాంకులకు నీరు ఎక్కకపోవడంతో కొంత ఆందోళన నెలకొన్నప్పటికీ అధికారులు శక్తివంతమైన మోటార్లను ఏర్పాటు చేసి ఆ సమస్యను అధిగమించారు. ప్రస్తుతం ట్రయల్ రన్‌లో భాగంగా గ్రామాలకు నీటిని విడుదల చేస్తున్నారు.అయితే ప్రస్తుత ప్రాజెక్టు సామర్థ్యంపై ప్రజల నుంచి కొన్ని విన్నపాలు అందుతున్నాయి. రోజుకు 57 వేల మందికి తలసరి 50 లీటర్ల చొప్పున 22 లక్షల లీటర్లను పంపింగ్ చేసేలా ఈ లైన్‌ను రూపొందించారు. కానీ ప్రజల అవసరాలు వంద లీటర్లకు పైగా ఉండటంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల కొందరు మళ్లీ పాత బోర్ల నీటినే వాడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం 22 లక్షల లీటర్ల పరిమితిని దాటి అదనపు నీటిని అందించేందుకు ఎ.కొండూరుకు మరో ప్రత్యేక పైప్‌లైన్ వేసేలా కొత్త ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. ఈ ప్రాజెక్టును శనివారమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ.. ఆయన టూర్ రద్దవటంతో మరో ముహూర్తానికి వాయిదా పడింది. త్వరలోనే ఈ ప్రాజెక్టును ప్రజలకు పూర్తిస్థాయిలో అంకితం చేయనున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## 258 గ్రామాల్లో బోర్ల తవ్వకాలు నిషేధం

**కడప, మే 11, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం కొత్తగా బోర్లు తవ్వకుండా నిషేధం విధించింది. మొత్తం 7 జిల్లాల్లోని 258 గ్రామాల్లో బోర్ల తవ్వకాలను నిషేధించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకపోతే జనాల కోసం తాగునీటి అవసరాలకోసం మాత్రం బోర్లు వేసుకోవచ్చు. ఈ జిల్లాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో ఏపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. బోర్ల తవ్వకాలపై నిషేధం విధించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7 జిల్లాల్లోని 258 గ్రామాల్లో కొత్తగా బోర్ల తవ్వకాలను నిషేధించారు. ఈ 258 గ్రామాల్లో ప్రజల తాగునీటి అవసరాల కోసం చేతిబోర్లకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. మిగిలిన కొత్త బోర్లు తవ్వేందుకు, ఇసుక తవ్వకాలకూ అనుమతి లేదని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో భూగర్భ జలాలు అడుగంటటడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బోర్లపై నిషేధం విధిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళంలో 76, ప్రకాశంలో 91, పల్నాడులో 20, చిత్తూరులో 8, అనంతపురం జిల్లాలో 14, శ్రీసత్యసాయి జిల్లాలో 39, కడపజిల్లాలో 10 గ్రామాలు కలిపి మొత్తం 258 గ్రామాల్లో నీటి వినియోగం మోతాదుకు మించి ఉన్నట్లు అధికారులు గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు ఏపీ రైతులకు వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ముందస్తుగా నీటి విడుదల కారణంగా ముందుగానే, ఇప్పటి నుంచే ఖరీఫ్ సన్నద్ధతపై దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో వ్యవసాయ అధికారుల్ని ఆదేశించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ జిల్లా వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటింజెన్సీ ప్లాన్‌తో ఎల్‌నినో ప్రభావం చూపే మెట్ట ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈసారి రైతులకు ముందస్తు నీటి విడుదలపై అవగాహన కల్పించాలని సూచించారు. అన్నదాతలు ముందుగానే పంట సాగు చేపడితే.. పంట కోత సమయంలో ప్రకృతి వైపరీత్యాల నుంచి తప్పించుకోవచ్చన్నారు. ప్రతి రైతు ఫార్మర్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలని.. ఏపీ ఎయిమ్స్ యాప్‌ను రోజూ గమనించాలని సూచించారు. రైతు రిజిస్ట్రీలో రైతులు అందరిని నమోదు చేయించాలి అన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లా అధికారులతో సోమశిల, కండలేరు ప్రాజెక్టుల నీటి విడుదలపై మాట్లాడారు. గతేడాది కన్నా ముందుగానే ఈసారి నీటిని విడుదల చేశారని.. వరి నాట్లు ఈనెల 25లోపు పూర్తవుతాయన్నారు.

## బాలినేనికి కీలక బాధ్యతలు

**ఒంగోలు, మే 11, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, డీ లిమిటేషన్ ప్రక్రియపై ఉమ్మడి జిల్లాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలలో వైసీపీ నుంచి వచ్చిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభానులకు స్థానం కల్పించారు. బాలినేని శ్రీనివాసరెడ్డికి ఉమ్మడి రాయలసీమ జిల్లాలతో పాటుగా ప్రకాశం, నెల్లూరు జిల్లాలను అప్పగించారు. ఇక సామినేని ఉదయభానుకు, నాదెండ్ల మనోహర్‌కు కలిపి కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలు అప్పగించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక బాధ్యతలు అప్పగించారు. డీ లిమిటేషన్ ప్రక్రియతో పాటుగా ఏపీలో త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కమిటీలను ఏర్పాటు చేసింది. మొత్తం 11 మంది సభ్యులతో మూడు కమిటీలను ఏర్పాటు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. సభ్యులకు తాజాగా జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి రాయలసీమ జిల్లాలైన ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలతో పాటుగా.. ప్రకాశం, నెల్లూరు జిల్లాల బాధ్యతలు అప్పగించింది.పవన్ కళ్యాణ్ ఆదేశాలత బాలినేని శ్రీనివాసరెడ్డి రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో పర్యటించనున్నారు. ఆయా జిల్లాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు. డీలిమిటేషన్ అంశాలపై చర్చిస్తారు. అనంతరం ఈ పర్యటన వివరాలతో సమగ్ర నివేదికను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు సమర్పించనున్నారు.అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కోసం ఏర్పాటు చేసిన కమిటీలో బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటుగా ఆరణి శ్రీనివాసులు, టీసీ వరుణ్‌కు స్థానం కల్పించారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల కోసం కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సీహెచ్ వంశీకృష్ణలతో కమిటీ ఏర్పాటైంది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల కోసం పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, కొటికలపూడి గోవిందరావులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇక కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలను నాదెండ్ల మనోహర్, సామినేని ఉదయభానులకు అప్పగించారు.మరోవైపు జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే వారం కమిటీలను ప్రకటించనున్నట్లు జనసేన పార్టీ తెలిపింది. జనసేన పార్టీ సంస్థాగత విస్తృత నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన ప్రక్రియలో పవన కళ్యాణ్ నిమగ్నమై ఉన్నారన్న జనసేన.. పార్టీ నిర్మాణంలో భాగమైన కమిటీల ఏర్పాటు కోసం గత కొన్ని నెలలుగా పవన్ కళ్యాణ్ ముఖ్య నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. శస్త్రచికిత్స నుంచి పూర్తిస్థాయిలో ఇంకా కోలుకోకపోయినప్పటికీ.. ఆరోగ్యపరమైన ఇబ్బందులున్నా కూడా కమిటీల ప్రకటనపై దృష్టిపెట్టారని తెలిపింది.

## విశాఖకు ఇన్నర్ రింగ్ రోడ్...

**విశాఖపట్టణం, మే 11 పెన్ పవర్:** విశాఖ నగరాన్ని రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల మేర సెమీ రింగురోడ్డు నిర్మించనున్నారు. భోగాపురం విమానాశ్రయానికి ఏడు కనెక్టింగ్ రోడ్లు, బీచ్ కారిడార్‌తో పాటు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుస్తూ ఆర్థిక కారిడార్‌ను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది.విశాఖ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానించడానికి రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల పొడవైన సెమీ రింగురోడ్డును ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఈ నెలాఖరు నాటికి సిద్ధం కానుంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే.. నగరం మధ్యలోకి భారీ వాహనాలు రాకుండా నేరుగా హైవేలకు అనుసంధానం అయ్యే అవకాశం ఉంటుంది. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా నగర శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి.నిర్మాణంలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రాధాన్యతనిస్తూ.. దానికి ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు రోడ్ల నిర్మాణం పూర్తి కాగా.. మిగిలినవి తుది దశలో ఉన్నాయి. విశాఖ నగరం నుంచి భోగాపురం వరకు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా ప్రత్యేక బీచ్ కారిడార్‌ను కూడా ప్రతిపాదించారు. ఇది పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే కాకుండా సముద్ర తీర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడుతుంది.నగరవాసుల ప్రాథమిక అవసరాలను తీర్చేందుకు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే విశాఖలోని 95 శాతం ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని మంత్రి నారాయణ వివరించారు. అలాగే మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన 90 శాతం వినతులను అధికారులు పరిష్కరించారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మార్చడమే లక్ష్యంగా.. విశాఖ ఎకనామిక్ కారిడార్‌ను బలోపేతం చేస్తూ ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ రంగాలకు పెద్దపీట వేస్తున్నారు. ఈ సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు విశాఖను గ్లోబల్ సిటీగా మార్చడంలో కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు వెల్లడించారు.

# నేతలపై అపనమ్మకమే...
# క్లైమాక్స్‌లో బిగ్ ట్విస్ట్.. మహానాడు వేదిక చేంజ్.

**నెల్లూరు, మే 11, పెన్ పవర్:**
తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ మహానాడు జరిపినా తమ సొంత ఇంటి కార్యక్రమంగానే భావిస్తుంటారు టీడీపీ క్యాడర్. అలాంటి పసుపు పండుగ జరిపే అవకాశం ఈ సారి మొదట సిక్కోలు గడప తొక్కింది. రాక రాక జిల్లాకు ఛాన్స్ ఇచ్చినట్లే ఇచ్చి..మహానాడును నెల్లూరుకు ఎందుకు తరలించారంటూ కార్యకర్తలు పెదవి విరుస్తున్నారట. అయితే పసుపు పండుగ నెల్లూరుకు షిఫ్ట్ కావడం వెనుక సిక్కోలు టీడీపీలో ఇంటర్నల్‌గా పెద్ద కథే నడిచిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.ఏపీ పొలిటిక్స్‌లో ఎప్పుడూ హాట్ టాపిక్‌గా ఉండే జిల్లా శ్రీకాకుళం. ఏ పార్టీ అధికారంలో ఉన్నా జిల్లా నేతలకు పెద్దపీట వేస్తుంటారు ఆ పార్టీ అధినేతలు. ఇక టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోటగా నిలిచిన జిల్లా ఇది. స్వయంగా ఎన్టీఆరే శ్రీకాకుళం జిల్లా నుంచి బరిలోకి దిగి గెలిచారంటూ తెలుగు తమ్ముళ్లు గుర్తు చేస్తున్నారు. 2024లో కూడా సిక్కోలు వాసులు టీడీపీకి బ్రహ్మరథం పట్టడంతో క్లీన్ స్వీప్ చేశారు. దీంతో టీడీపీ అధినేత కూడా కింజరాపు అచ్చెన్నాయుడుకు రాష్ట్ర మంత్రి వర్గంలో..రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం ఇచ్చారు. ఇక క్యాడర్‌తో సమావేశంలో భాగంగా జిల్లాలో ఈ సంవత్సరం టీడీపీ పసుపు పండగ మహానాడు సిక్కోలులోనే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్.ఇచ్చిన మాట ప్రకారం ఈ సంవత్సరం శ్రీకాకుళం జిల్లాలోనే టీడీపీ మహానాడుకు ఏర్పాట్లు చేయాలంటూ లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. పార్టీ పెద్దలు, జిల్లా ఇంచార్జ్ మంత్రితో సహా టీడీపీ కీలక నేతలంతా రంగంలోకి దిగారు. మహానాడుకు అనువైన స్థలాల కోసం జల్లెడ పట్టారు. శ్రీకాకుళం జిల్లాలోని పైడి భీమవరంతో పాటు శ్రీకాకుళం పట్టణంలోని చాపురం, పాత్రునివలస వంటి ప్రాంతాల్లో పర్యటించి అనువైన స్థలాలు ఎంపిక చేశారు. వాస్తు సిద్దాంతులు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇక పనులు షూరూ చేయండని అధిష్టానం నుంచి ఆదేశాలు కూడా వచ్చాయి. జిల్లాలో మహానాడు జరుగుతుందంటూ తెలుగు తమ్ముళ్లు సైతం ఖుస్ అయ్యారు. సీన్ కట్ చేస్తే క్లైమాక్స్‌లో బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. మహానాడు వేదిక శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరుకు మారిపోయింది.




దీంతో సిక్కోలు టీడీపీ క్యాడర్ అంతా షాక్ అయిపోయిన పరిస్థితి.తెలుగు వార్తలుమహానాడు వేదిక మార్పునకు సిక్కోలు టీడీపీ నేతల తీరే కారణమన్న చర్చ జరుగుతోంది. ఉత్తరాంధ్రలో ప్రధానమంత్రి మోదీ పర్యటన ఉందని..ఆ కార్యక్రమాన్ని కూడా పెద్దఎత్తున నిర్వహించే ప్లాన్ ఉండటంతోనే మహానాడు వేదికను మార్చినట్లు పైకి చెబుతూ వస్తున్నారు నేతలు. కానీ అసలు కారణం వేరే ఉందంటూ గుసగుసలు మొదలయ్యాయి. మహానాడు నిర్వహణ, ఏర్పాట్లు కోసం ఇనీషియేషన్ తీసుకోవాల్సిన సిక్కోలు టీడీపీ ముఖ్యనేతలు అధిష్టానం ఆశించినంత ఉత్సాహం చూపించలేదట. పసుపు పండుగ అంటే దాదాపు 20 రోజులు అక్కడే మకాం వేయాలి. అతిథులకు వసతి ఏర్పాట్లు, పసందైన వంటకాలు వడ్డించడం వంటివి చాలా రిస్క్. ఈ స్థాయిలో ఎఫర్ట్స్ పెట్టి మహానాడు నిర్వహణకు అరేంజ్‌మెంట్స్ చేసేందుకు కీలక నేతలెవరూ ముందుకు రాలేదన్నది ఇన్‌సైడ్ టాక్.ఏదో లోకేశ్ నుంచి ఆదేశాలు వచ్చాయి కాబట్టి ..స్థల పరిశీలన అంటూ హడావుడి చేశారే తప్ప..లీడర్లలో సీరియస్‌నెస్ కనిపించలేదట. దీంతో శ్రీకాకుళం నేతలను నమ్ముకుంటే..సీన్ సితారైపోతుందని భావించిన పార్టీ పెద్దలు..వెంటనే మహానాడు వేదికను మార్చేశారట. పసుపు పండుగ నిర్వహణకు ఆసక్తిగా ఉన్న సింహపురి నేతలు మహానాడు బాధ్యతలను భుజాన వేసుకున్నారట. ఇప్పటికే ఏర్పాట్లకు శంకుస్థాపన చేసి..పనులను స్పీడప్ చేశారు. అయితే రాకరాక
అవకాశం దక్కితే మహానాడు వేదిక మరో చోటుకు తరలిపోయేలా చేశారంటూ శ్రీకాకుళం టీడీపీ క్యాడర్ తమ నేతలపై తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. సొంత జిల్లాలో మహానాడు వేడుక జరుగుతుందని సంబరపడితే..ఆ ఆనందం ఎంతసేపు మిగలలేదంటూ నిరుత్సాహ పడిపోయారట. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ పదవులు వెలగబెట్టిన అనుభవమున్న నేతలు..మహానాడును నిర్వహించలేకపోయారా.? అంటూ పెదవి విరుస్తున్నారు

# ఏపీలోకి టీవీకేపార్టీ.. కాంగ్రెస్ తో పొత్తు

**తిరుపతి, మే 11, పెన్ పవర్:**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ టీవీకే పార్టీ ప్రభంజనం సృష్టించింది.. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. టీవీకేతో కలిసొచ్చే పార్టీలతో కలిసి విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. సినిమాలతో అభిమానులతో మొదలైన విజయ్ ప్రస్థానం.. ఎన్నికల గెలుపు వరకు సాగింది. తమిళనాడులో పార్టీ ప్రారంభించిన రెండేళ్లలోనే తిరుగులేని విజయం సాధించడంతో టీవీకేలో కొత్త జోష్ నింపింది. విజయ్ ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో ఓ ట్రెండ్ సెట్టర్‌గా మారారనే చెప్పాలి.. టీవీకే విజయం దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీసింది.తమిళనాడులో టీవీకే విజయం తర్వాత.. విజయ్ నెక్స్ట్ ప్లాన్ ఏంటి.. దళపతి తమిళనాడుతో ఆగుతారా పొరుగున ఉన్న రాష్ట్రాల్లోకి ఎంట్రీ ఇస్తారా అనే చర్చ మొదలైంది. ముఖ్యంగా విజయ్ కన్ను ఆంధ్రప్రదేశ్‌పై పడిందనే ఊహాగానాలు మొదలయ్యాయి.. టీవీకే అధినేత తమిళనాడు సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని విస్తరించే అవకాశం ఉందంటున్నారు. తమిళనాడు ఎన్నికలకు ముందు నుంచే ఆంధ్రప్రదేశ్ టీవీకే పార్టీ పేరుతో కొందరు సోషల్ మీడియాలో పేజీలు కూడా నడపుతుండటంతో టాక్ మొదలైంది. విజయ్ ముందు తమిళనాడులో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకు టీవీకే పార్టీని విస్తరిస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి.విజయ్ ఆంధ్రప్రదేశ్‌వైపు రావడానికి కారణాలు చాలానే ఉన్నాయి. తమిళనాడులో విజయ్‌కు యువత నుంచి మంచి ఆదరణ వచ్చింది.. దళితులు, క్రిస్టియన్లు మద్దతు తెలిపారు. ఇక్కడ కూడా అడుగుపెట్టి ఆయా సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే అవకాశం ఉందంటున్నారు. ఏపీలో ముఖ్యంగా తీరప్రాంత జిల్లాలతో పాటుగా యువత, క్రిస్టియన్లు, దళిత ఓటర్లను ఆకట్టుకుంటే బలమైన రాజకీయశక్తిగా ఎదగొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే



తమిళనాడుతో పోలిస్తే ఏపీలో క్రిస్టియన్ల సంఖ్య ఎక్కువగా ఉండటం కూడా కలిసొస్తుందంటున్నారు. తమిళనాడు ఫార్ములాను ఫాలో అవుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రస్తుతం ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు. టీవీకే పార్టీని విస్తరించేందుకు ఆంధ్రప్రదేశ్ మంచి ఆప్షన్ అనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే తెలుగు ఇండస్ట్రీ నుంచి, ఇతర రాజకీయ పార్టీల నుంచి వచ్చేవారిని ఏకం చేస్తే ఇంకా ప్లస్ అవుతుందంటున్నారు.అంతేకాదు విజయ్ టీవీకే పార్టీ ఏపీలో కాంగ్రెస్‌తో జతకట్టి ఎన్నికలకు వెళ్లే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తమిళనాడు సరిహద్దుతో పాటుగా మరికొన్ని చోట్ల టీవీకే అభ్యర్థులకు అవకాశం ఇచ్చి కూటమిగా బరిలోకి దిగే అవకాశాలు కొట్టిపారేయలేం అంటున్నారు. ఏపీ సరిహద్దులోని కొన్ని జిల్లాలపై తమిళనాడు ప్రభావం ఉంటుంది.. మిగిలిన చోట్ల బలపడాలంటే కష్టంగా ఉంటుంది. అందుకే ఏపీలో కాంగ్రెస్‌తో కలిసి ముందుకు సాగితే సక్సెస్ కావొచ్చు అంటున్నారు.

### యానాంలో ఘోర ఓటమి

యానాంలో విజయ్ టీవీకే అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. యానాం నియోజకవర్గం కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్యలో ఉంది. ఈ నియోజకవర్గంలో తెలుగు ప్రజలు ఎక్కువ. రాజకీయంగా వారి ప్రభావం కూడా ఎక్కువే. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న యానాం నియోజకవర్గంలోని ఓటర్లు విజయ్ టీవీకేకు ఘోర పరాభవాన్ని రుచి చూపించారు. టీవీకే అభ్యర్థి తోట రాజు కేవలం 167 ఓట్లు మాత్రమే సాధించి డిపాజిట్ కూడా పోగొట్టుకున్నారు. టీవీకే అభ్యర్థి కంటే.. నోటాకు 193 ఓట్లు పడటం విశేషం. దీంతో తెలుగు ప్రజలు విజయ్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.మరోవైపు యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో 37,972 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 35,445 మంది అంటే 93.35 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఎన్నార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లాడి కృష్ణారావు విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌పై మల్లాడి కృష్ణారావు 4,568 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎమ్మెల్యేగా మల్లాడి కృష్ణారావు ఆరోసారి విజయం సాధించారు.మరోవైపు పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి విజయానికి హామీలు కూడా ప్రధాన కారణమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మంచినీటి ఏటీఎంలు, అటల్ క్యాంటీన్లు, బాలికలకు ఈ–స్కూటర్లు, స్థానికులకే ఉద్యోగ రిజర్వేషన్లు వంటి హామీలు ఓటర్లను ఆకర్షించాయి. మత్స్యకారులను వెనుకబడిన జాబితాలో చేరుస్తామని ప్రకటించడం కూడా కలిసి వచ్చింది. విజయ్ టీవీకే పార్టీ కూడా ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చటం ఎన్డీఏ కూటమికి కలిసి వచ్చింది.

## ఐపీఎల్‌లో PBKS తరపున ఎంట్రీ.. 18 ఏళ్ల తర్వాత పంజాబ్ VS రాజస్థాన్ మ్యాచ్‌కి అంపైర్‌గా శ్రీవాస్తవ



**హైదరాబాద్ పెన్ పవర్:** లక్నోకు చెందిన మాజీ రంజీ ఆటగాడు తన్మయ్ శ్రీవాస్తవ ఐపీఎల్‌లో ఆన్-ఫీల్డ్ అంపైర్‌గా అరంగేట్రం చేయబోతున్నాడు. ఏప్రిల్ 28న ముల్లాన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌తో అతను ఈ కొత్త బాధ్యతలను చేపట్టాడు. 2008లో పంజాబ్ కింగ్స్ జట్టు తరపున ఆటగాడిగా ఐపీఎల్‌లో అడుగుపెట్టిన శ్రీవాస్తవ, 18 సంవత్సరాల తర్వాత మళ్లీ అదే జట్టు ఆడే మ్యాచ్‌లో సరికొత్త పాత్రలో మైదానంలోకి దిగడం విశేషం.

ఐపీఎల్‌లో ఆన్-ఫీల్డ్ అంపైర్‌గా విధులు నిర్వర్తించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన మొట్ట మొదటి అంపైర్‌గా అతను గుర్తింపు పొందాడు. గత ఏడాది అతను ఐపీఎల్‌లో ఫోర్త్ అంపైర్‌గా ఎంట్రీ ఇచ్చాడు. ఈ సీజన్‌లో ఆన్-ఫీల్డ్ అంపైర్‌గా అతనికి మొత్తం నాలుగు మ్యాచ్‌ల బాధ్యతలు అప్పగించారు. వీటితో పాటు, పలు మ్యాచ్‌లలో ఫోర్త్ అంపైర్‌గా, టీవీ అంపైర్‌గా కూడా అతను సేవలు అందించనున్నాడు.

పంజాబ్ కింగ్స్ జం రాజస్థాన్ రాయల్స్ (ఏప్రిల్ 28)

ఢిల్లీ క్యాపిటల్స్ జం చెన్నై సూపర్ కింగ్స్ (మే 5)

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జం ముంబై ఇండియన్స్ (మే 10)

చెన్నై సూపర్ కింగ్స్ జం సన్‌రైజర్స్ హైదరాబాద్ (మే 18)

**క్రికెటర్‌గా ప్రయాణం:**

అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన తన్మయ్ శ్రీవాస్తవ.. తన క్రికెట్ ప్రయాణాన్ని లక్నో వీధుల్లో ప్రారంభించాడు. అతను మొదట చౌక్, కేడీ సింగ్ బాబు స్టేడియాల్లో ఆడాడు. ఆ తర్వాత గ్రీన్ పార్క్ హాస్టల్‌కు వెళ్లి, కాన్పూర్ తరపున అండర్-14 క్రికెట్ నుంచి ఫస్ట్ క్లాస్ క్రికెట్ వరకు అంచెలంచెలుగా ఎదిగాడు. టీమిండియా మాజీ అండర్-19 కెప్టెన్ అయిన శ్రీవాస్తవ, తన కెరీర్‌లో 90 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి 4,918 పరుగులు సాధించాడు.

ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత శ్రీవాస్తవ ఆర్సీబీ (RCB) జట్టుకు స్కౌట్‌గా కూడా పని చేశాడు. అనంతరం కోచింగ్ వైపు వెళ్లగా, లెవల్ 2 కోచింగ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. జమ్మూ కాశ్మీర్ రంజీ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా సేవలు అందించడంతో పాటు నేషనల్ క్రికెట్ అకాడమీ లో అండర్-16 జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా కూడా పని చేశాడు. ఆ తర్వాత అంపైరింగ్ వైపు అడుగులు వేసిన అతను, గత మూడేళ్లుగా దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లలో అంపైర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

# ఐపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్లకి బీసీసీఐ వార్నింగ్.. రూల్స్ బ్రేక్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ క్లైమాక్స్‌కు వచ్చేసింది. లీగ్ స్టేజ్ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. దీంతో ఐపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్ల తీరుపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బోర్డు జారీ చేసిన నిబంధనలను కొన్ని జట్ల యజమానులు ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించింది. ఇకపై రూల్స్ బ్రేక్ చేస్తే కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇటీవలే ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. మ్యాచ్ జరిగే సమయంలో జట్టు ఓనర్లు ప్లేయింగ్ ఏరియాలోకి రావొద్దని, ఆటగాళ్లు లేదా సపోర్ట్ స్టాఫ్‌తో ప్రత్యక్షంగా మాట్లాడొద్దని తేల్చి చెప్పారు. కానీ కొందరు ఓనర్లు ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదని బీసీసీఐ చెప్పింది.



ఐపీఎల్ ఫ్రాంచైజీ యజమానులకు ఇప్పటికే వార్నింగ్ ఇచ్చాం.. డగౌట్ సమీపంలో ఓనర్లు తిరుగుతూ కనిపిస్తున్నారు.. మరికొందరు మొబైల్ ఫోన్లతో స్టేడియంలోకి వచ్చి ఫొటోలు కూడా తీస్తున్నారు.. వాటికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయి.. అనేక సార్లు హెచ్చరించినా వారి తీరులో మార్పు రావడం లేదు.. మరోసారి ఇదే సీన్ రిపీట్ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు.

ఐపీఎల్ 2026 సీజన్‌లో 'హనీ ట్రాప్' ప్రమాదాలపై కూడా బీసీసీఐ అన్ని ఫ్రాంచైజీలను అలర్ట్ చేసింది. ప్లేయర్స్ లేదా అధికారులపై లైంగిక వేధింపుల లాంటి ఆరోపణలు వచ్చే ఛాన్స్?లు ఉన్నాయని వార్నింగ్ ఇచ్చింది. హై ప్రొఫైల్ క్రీడా వాతావరణాల్లో ఇలాంటివి ఎక్కువగా ఉంటాయి, ప్రతి ఫ్రాంచైజీ అప్రమత్తంగా ఉండాలని దేవజిత్ సైకియా తెలియజేశారు. బీసీసీఐ, ఐపీఎల్ ఆపరేషన్స్ సభ్యులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి నజర్ పెట్టింది. ఈ బృందాలు హోటల్ గదుల్లో తనిఖీలు చేయడంతో పాటు పర్మిషన్ లేని వ్యక్తులు.. ప్లేయర్స్ గదుల్లోకి ప్రవేశించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని బీసీసీఐ హెచ్చరికలు జారీ చేసింది.

# ఐపీఎల్ నుంచి రెండు టీమ్స్ ఔట్.. మిగతా జట్ల ప్లేఆఫ్స్ లెక్కలు ఇవే!

**హైదరాబాద్ పెన్ పవర్:** IPL 2026 Playoffs: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 తుది దశకు చేరుకుంది. ఆదివారం ఒక్క రోజే రెండు టీమ్స్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాయి. ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చివరి బంతికి విజయం సాధించింది. అలాగే మరో మ్యాచ్‌లో లక్నోపై చెన్నై సూపర్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ రెండు మ్యాచ్‌ల ఫలితంతో ముంబై, లక్నో సూపర్ జెయింట్స్ అధికారికంగా ప్లేఆఫ్ రేసు తప్పుకున్నాయి. మిగిలిన 8 జట్లు టాప్-4లో నిలిచి ప్లేఆఫ్ బెర్తు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పుడు 8 జట్ల ప్లేఆఫ్స్ లెక్కలని ఒకసారి పరిశీలిద్దాం..



**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు** : ఇప్పటి వరకు ఐపీఎల్ లో 11 మ్యాచ్ లు ఆడిన ఆర్సీబీ 14 పాయింట్లతో టాప్ ప్లేస్ లో కొనసాగుతోంది. ఇక నెట్ రన్‌రేట్ (+1.103).. మరో మ్యాచ్ గెలిస్తే 16 పాయింట్లతో ప్లే ఆఫ్స్ కి చేరుకుంటుంది. ఒకవేళ బెంగళూరు మిగతా 3 మ్యాచ్ లలో గెలిస్తే 20 పాయింట్లతో క్వాలిఫయర్-1కు నేరుగా చేరుకుంటుంది. అప్పుడు ఫైనల్ చేరడానికి రెండు ఛాన్స్ లు ఉంటాయి. **సన్ రైజర్స్ హైదరాబాద్:** సన్ రైజర్స్ జట్టు కూడా 11 మ్యాచ్లో 7 విజయాలతో 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. కానీ, నెట్ రన్‌రేట్ (+0.737) తక్కువగా ఉండటంతో సెకండ్ ప్లేస్ లో కొనసాగుతుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా అర్హత సాధించాలంటే తమ చివరి 3 మ్యాచులలో రెండింటిలో గెలవాల్సిందే. మే 22వ తేదీన ఆర్సీబీతో జరిగే హైదరాబాద్ చివరి లీగ్ మ్యాచ్ క్వాలిఫయర్-1 స్థానాన్ని ఎవరు దక్కించుకుంటారో నిర్ణయిస్తుంది. **గుజరాత్ టైటాన్స్.** గుజరాత్ జట్టు 11 మ్యాచులు ఆడి 14 పాయింట్లతో 3వ స్థానంలో ఉంది. ఆర్సీబీ, సన్ రైజర్స్ జట్లతో పోలిస్తే గుజరాత్ నెట్ రన్‌రేట్ (+0.228) తక్కువగా ఉంది. టైటాన్స్ ప్లేఆఫ్స్ కి చేరాలంటే తర్వాత ఆడే 3 మ్యాచ్ లలో రెండింట్లో తప్పక గెలవాల్సిన అవసరం ఉంది. మే 12న గుజరాత్, హైదరాబాద్ మధ్య జరగబోయే మ్యాచ్ ఇరు జట్లకు కీలకం కాబోతుంది. **పంజాబ్ కింగ్స్:** ఐపీఎల్ లో 10 మ్యాచులు ఆడిన పంజాబ్ ఇప్పటికే 13 పాయింట్లు సాధించింది. చివరి నాలుగు మ్యాచులలో రెండింట్లో గెలిస్తే చాలు ఆ జట్టు 17 పాయింట్లతో సునాయాసంగా ప్లే ఆఫ్స్ బెర్తును చేరుకుంటుంది. ఢిల్లీ, ముంబై, ఆర్సీబీ, లక్నోలతో పంజాబ్ కింగ్స్ తమ తర్వాత మ్యాచులలో పోరాడాల్సిన అవసరం ఉంది. **చెన్నై సూపర్ కింగ్స్:** ప్రస్తుతం 12 పాయింట్లతో ఉన్న చెన్నై కాస్త గడ్డ పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఈ జట్టు చివరి మూడు మ్యాచ్ లలో రెండింట్లో గెలిస్తే 16 పాయింట్ల వస్తాయి. కానీ, నెట్ రన్‌రేట్ (+0.185) తక్కువగా ఉండటం సీఎస్కేకి కొంచెం ఇబ్బందికరంగా మారింది. ఎల్లో ఆర్మీ నేరుగా అర్హత సాధించాలంటే మిగతా అన్ని మ్యాచులలో తప్పక గెలవాల్సిందే. **రాజస్థాన్ రాయల్స్:** ఈ జట్టు కూడా ఇప్పటి వరకు 11 మ్యాచులలో 6 విజయాలు సాధించింది. మిగతా 3 మ్యాచ్లో కనీసం రెండింట్లో గెలిస్తే ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. గత 4 మ్యాచులలో మూడింట ఓడిపోవడంతో రాజస్థాన్ నెట్ రన్ రేట్ (+0.082) ఘోరంగా పడిపోయింది. ఈ టీమ్ నాలుగో స్థానం కోసం సీఎస్కేతో పోటీ పడే ఛాన్స్ ఉంది. **కోల్‌కతా నైట్‌రైడర్స్:** కేకేఆర్ ప్లేఆఫ్స్ చేరుకోవడానికి చాలా తక్కువ ఛాన్స్ లు ఉన్నాయి. 10 మ్యాచులు ఆడిన నైట్‌రైడర్స్ 9 పాయింట్లతో కొనసాగుతుంది. ఈ జట్టు 17 పాయింట్ల మార్కును చేరుకోవాలంటే మిగిలిన నాలుగు మ్యాచులలోనూ తప్పక గెలవాల్సిందే. ఒక్క మ్యాచ్లో ఓడినా చెన్నై, రాజస్థాన్ లాంటి ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంది. **ఢిల్లీ క్యాపిటల్స్:** 11 మ్యాచ్లో నాలుగింట్లో గెలిచిన ఢిల్లీ సాంకేతికంగా మాత్రమే ప్లేఆఫ్స్ రేసులో నిలిచింది. ఈ జట్టు 14 పాయింట్లకు చేరుకోవడానికి మిగిలిన అన్ని మ్యాచ్లలోనూ గెలిచి తీరాల్సిందే. అలాగే ఇతర జట్ల ఫలితాలు కూడా తమకు అనుకూలంగా రావాలని ఢిల్లీ ఆశించాల్సిందే.

# బుట్టబొమ్మ తొలిసారి హద్దులు చెరిపేసిందా?





జిన్నీ వెడ్స్ సన్నీ 2ని ప్రమోట్ చేస్తున్నప్పుడు మేధా శంకర్ గ్రీన్ లెహంగాలో స్టన్స్ చేసింది

బుట్టబొమ్మగా ఫేమస్ అయిన పూజాహెగ్డే కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఒకప్పుడు వరుస విజయాలతో గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న ముద్దుగుమ్మకు కొంతకాలంగా అదృష్టం కలిసిరావడం లేదు. తెలుగు,తమిళ్ లో కొన్ని సినిమాలు చేతిలో ఉన్నా? అవి రిలీజ్ అయి సక్సెస్ అయ్యే వరకూ గానీ అమ్మడి కెరీర్ ఎలా ఉంటుందన్నది క్లారిటీ రాదు. ప్రస్తుతం వరుణ్ ధావన్ సరసన -హై జవాని- అనే హిందీ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాతోనైనా బాలీవుడ్ లో మళ్లీ సక్సెస్ అందుకోవాలని ఆశపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించి ముంబై వర్గాల్లో ఓ ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.పూజా హెగ్డే ఈ చిత్రం కోసం గ్లామర్ హద్దులను చెరిపేసి నటిపస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. సాధారణంగా తన సినిమాల్లో గ్లామర్‌కు ప్రాధాన్యత ఇచ్చే పూజా ఈ హిందీ ప్రాజెక్ట్ కోసం మరింత బోల్డ్‌గా కనిపించబోతోందని సమాచారం. బాలీవుడ్ నెటిజన్లను , యువతను ఆకట్టుకోవడానికి ఆమె ఈ విధమైన మేకోవర్ ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. -హై జవాని- చిత్రం యూత్ ఫుల్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోంది. వరుణ్ ధావన్ వంటి ఎనర్జిటిక్ హీరో సరసన పూజా నటిస్తుండటంతో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందనే అంచనా లుంటాయి. ముఖ్యంగా పాటల్లో , కొన్ని కీలక సన్నివేశాల్లో పూజా గతంలో ఎన్నడూ లేని విధంగా గ్లామర్ యాంగిల్‌ను ప్రదర్శించబోతోందని బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. నటనకే పరిమితం కాకుండా బోల్డ్ యాంగిల్ తోనైనా తాను అనుకున్నది సాధించలనే పట్టుదలతో కనిపిస్తుంది. ప్రచార చిత్రాలు , లీక్ అయిన వార్తలు మాత్రం అమ్మడు అందాల ఆరబోతపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. సౌత్ సినిమాల్లో పద్ధతిగా కనిపించి మెప్పించిన భామ నార్త్ మార్కెట్ కోసం ఇలా రూట్ మార్చడం చర్చనీ యాంశమైంది. మారుతోన్న ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడంలో భాగంగానే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.వరుస పరాజయాలు ఎదురైనప్పుడు నటీనటులు ఇమేజ్‌ను మార్చుకోవడం సహజం. పూజా హెగ్డే కూడా అదే బాటలో పయనిస్తుంది. -హై జవాని- సక్సెస్ ఆమె బాలీవుడ్ కెరీర్‌కు ఊపిరి పోయడమే కాదు. మళ్ళీ టాలీవుడ్ మేకర్స్ దృష్టిని ఆకర్షించడానికి దోహదప డుతుందని అమ్మడు బలంగా నమ్ముతుంది. షూటింగ్ దశలోనే ఇంతటి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా విడుదల తర్వాత ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి. మొత్తంగా పూజా హెగ్డే కెరీర్ గ్రాఫ్‌ను మళ్ళీ పైకి తీసుకెళ్లడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. హద్దులు చెరిపేయడం అనేది గ్లామర్ పరంగానే కాకుండా వైవిధ్యమైన పాత్రలు చేయడానికి సిద్ధంగా ఉందనే సంకేతంగా భావించొచ్చు.





స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965